

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 1 డిసెంబరు 2025



నేటి ప్రజావాణి రద్దు : కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందు వల్ల సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ప్రజావాణి రద్దు కొనసాగుతుందని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.



● ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెంకటాపురం గ్రామంలో పాల వెంకటరెడ్డి అనే మాజీ సర్పంచ్‌కి సంబంధించి సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులకు రూ.40లక్షల బకాయి రావాల్సి ఉంది. ఈయన అప్పులు తీర్చుకునేందుకు తన 7 ఎకరాల భూమిని అమ్ముకున్నారు. ఇదే మండలంలోని భీమవరం మాజీ సర్పంచ్ గరికంటి వౌనికకు రూ.12 లక్షల బకాయి రావాల్సి ఉంది. రామన్నపాలెం మాజీ సర్పంచ్ షేక్ నాగులమీరాకు రూ.15 లక్షలు, మర్లపాడు మాజీ సర్పంచ్ మంద పాటి వేణుగోపాలరెడ్డికి రూ.20లక్షల బకాయిలు రావాల్సి ఉంది. ఈయన అప్పులు తీర్చుకోవడానికి రెండెకరాల భూమిని అమ్ముకొని సత్తుపల్లి వచ్చి వాటర్ బాటిళ్ల వ్యాపారం చేసుకుంటున్నాడు.

● భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలోని 30 పంచాయతీల్లో సుమారు రూ.2 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. ఆ మండలంలోని వేదాంతపురం పంచాయతీలో రూ.10లక్షలు, తిరుమలకుంట పంచాయతీలో రూ.12లక్షల బకాయిలు ఉన్నాయి. అలాగే దమ్మపేట మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో రూ. 2.5 కోట్ల బకాయిలు ఉండగా.. ఒక్క దమ్మపేట పంచాయతీలోనే రూ.25లక్షల బకాయి పెండింగ్‌లో ఉంది.

బిల్లుల భయం


బకాయిల భారం

- ఉమ్మడి జిల్లాలో రూ. కోట్లల్లో పేరుకుపోయిన బకాయిలు
- కాబోయే సర్పంచ్‌లకు సవాల్‌గా మారిన బకాయిల చెల్లింపులు
- మాజీ సర్పంచుల్లోనూ బిల్లుల భయం
- ఇంకెప్పుడు వస్తాయోనని ఆశగా ఎదురుచూపులు

■ ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పంచాయతీ సర్పంచ్ పదవి కోసం లక్షల రూపాయల ఖర్చు పెట్టి పదవుల్లో ఎక్కబోతున్న కొత్త సర్పంచ్‌లకు పాత సర్పంచ్‌ల బకాయిలు బిల్లులు సవాల్‌గా మారనున్నాయి. ప్రతీ పంచాయతీలో కనీసం రూ.లక్ష నుంచి 40లక్షల వరకు బకాయిలు ఉండడంతో.. కొత్తగా ఎన్నికల్లో గెలిచి బాధ్యతలు చేపట్టే సర్పంచ్‌లకు బిల్లులు భారం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో రూ20కోట్ల నుంచి 25 కోట్లకు పైనే బిల్లుల బకాయిలు ఉన్నట్టు సమాచారం. గత పంచాయతీ పాలక వర్గాల సర్పంచ్‌లు చివరి వరకు బిల్లుల కోసం పోరాడారు. గత ప్రభుత్వ ఆర్థిక సంక్షోభంతో పంచాయతీలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయలేదు. ఉపాధి హామీ పథకంలోని రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు.. ఇలా పలు నిర్మాణ పనులకు సంబంధించి మ్యాచింగ్ గ్రాంట్ నిధులు సర్పంచ్‌లకు అందలేదు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పలు గ్రాంట్ల పనులు కూడా పంచాయతీల్లో సర్పంచ్‌లు అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. పాలకవర్గ పదవీకాలం పూర్తయినా బిల్లులు మంజూరు కాలేదు. గ్రామాల్లో రోడ్లు, మంచి నీటి సరఫరా పనులు, పల్లె ప్రకృతి వనాలు, పల్లె క్రీడా మైదానాలు, వైకుంఠ ధామాలతో పాటు పలు రకాల అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. కొందరు సర్పంచ్‌లు కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. బిల్లులు కాకపోవడంతో సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు కూడా గడిచిన మూడేళ్లుగా నిధులకోసం ఎదురు చూస్తున్నారు. దీంతో కొత్తగా ఎన్నిక కానున్న సర్పంచ్‌లకు ఈ బిల్లుల చెల్లింపు భారం కానుంది. పాత బకాయిలు కొత్త సర్పంచ్‌లకు భారం కానున్నాయి. కొత్తగా వచ్చే గ్రాంట్లు, నిధులు పనులు కొత్త సర్పంచ్‌లు ప్రతిపాదించుకున్న పనులకే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. దీంతో పాత బిల్లులు వస్తాయా!? లేదా పెండింగ్‌లో ఉంటాయా!? అన్నది మాజీ సర్పంచ్‌లు ఆవేదనకు గురవుతున్నారు. కొంతమంది వడ్డీలకు తెచ్చి అప్పుల పాలైనా బాధను చెప్పుకోలేక బిల్లులు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మొత్తం 571 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల వేళ అధికారికంగా చెప్పేందుకు ముందుకు రావడం లేదు. మాజీ సర్పంచ్‌లు ఎక్కువ మంది అధికార పార్టీలో ఉన్నందున చెప్పడం లేదు. ఖమ్మం జిల్లాలో ఉదాహరణకు కొన్ని పంచాయతీలకు సంబంధించిన బకాయిలు..

● ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని అడవిమల్లేల సర్పంచ్ మందడి అశోక్‌కుమార్‌కు గ్రామ పంచాయతీలలో (మిగతా 6వ పేజీలో)



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

'స్కూల్ ఆఫ్ మైన్స్' నుంచి

ఎర్త్ సైన్స్‌గా..

- ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచేలా యూనివర్సిటీ
- అరుదైన ఖనిజ సంపద లభించడంతోనే అత్యుత్తమ ప్రదేశంగా ఎంపిక
- పాల్వంచలో ఆధునిక పరిజ్ఞానంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం
- జాతీయ రహదారులతో పాటు ఖమ్మం, కొత్తగూడెం రింగ్‌రోడ్లకు ఆమోదం
- అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఎర్త్‌సైన్స్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

కొత్తగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతంలో సింగరేణి నిర్వహించిన 'స్కూల్ ఆఫ్ మైన్స్'.. తర్వాత ఇంజనీరింగ్ కళాశాలగా మారగా.. ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా చారిత్రాత్మకమైన 'డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. డిసెంబరు 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కొత్తగూడెంలోని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం, అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో.. ఆదివారం ఆయన పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. భూగోళ శాస్త్రాలు, సహజ వనరులు, ఖనిజ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా నిలిచే విధంగా దేశంలోనే ప్రత్యేకత కలిగిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం లేకపోవడంతో ప్రత్యేక యూనివర్సిటీ అవసరాన్ని (మిగతా 6వ పేజీలో)

సింగరేణి కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలి

- క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తాం
- కోల్ ఇండియా కబడ్డీ పోటీల ముగింపులో సింగరేణి చైర్మన్ బలరాం




కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన డబ్ల్యూసీఎల్ టీమ్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న సింగరేణి చైర్మన్ బలరాం

కొత్తగూడెం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసే విధంగా ముందుకు సాగుతున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ప్రకటించారు. క్రీడలతో పాటు క్రీడాకారులనూ మరింత ప్రోత్సహించేందుకు సింగరేణి యాజమాన్యం అగ్రభాగాన నిలుస్తుందన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో కోల్ ఇండియా కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బలరాం మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో క్రీడలకు అధిక ప్రాధాన్యత లభిస్తుందని, ఒక్కో ఏరియాలో ఒక్కో క్రీడకు ఆదరణ ఉంటుందన్నారు. కోల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు కొత్తగూడెం ఏరియాను ఎంపిక చేయడానికి క్రీడల పట్ల యువతను ప్రోత్సహించడం కోసమేనని అన్నారు. ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అద్భుతమైన క్రీడా స్ఫూర్తి ద్వారా విజయాలు సాధించవచ్చునన్నారు. క్రీడలు స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. సింగరేణి యాజమాన్యం క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంతో పాటు క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా 8 కోల్ కంపెనీలకు సంబంధించిన క్రీడాకారులు సింగరేణిలో కబడ్డీ ఆటలు ఆడడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో కబడ్డీ పోటీలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కాగా.. ఆ తర్వాత జరిగిన కోల్ ఇండియా కబడ్డీ ఫైనల్స్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీకి వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ జట్ల మధ్య హోరా హోరీగా పోరు జరిగింది. ఈ పోటీలో డబ్ల్యూసీఎల్ 44 పాయింట్లు సాధించగా.. ఎస్ఈసీఎల్ 25 పాయింట్లతో సరిపెట్టుకోగా 44 పాయింట్లతో డబ్ల్యూసీఎల్ విజయం సాధించింది. అనంతరం కబడ్డీ క్రీడల్లో విజయం సాధించిన (మిగతా 6వ పేజీలో)

ఏకగ్రీవానికి ఎర

- జిల్లాలోని పలు పంచాయతీల్లో జోరుగా సాగుతున్న మంతనాలు
- పనులు.. పదవులూ ఇస్తామని 'ముందస్తు' ఒప్పందాలు
- తొలి విడతలో ఇప్పటికే ఆరు పంచాయతీల్లో ఏకగ్రీవం
- మరికొన్ని ఏకగ్రీవాలకు నేతల ప్రయత్నం



ఖమ్మం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలోని పలు పంచాయతీల్లో ఏకగ్రీవానికి తెర వెనుక జోరుగా రాజకీయం నడుస్తోంది. 'పంచాయతీల్లో పోటీ వద్దు.. ఏకగ్రీవం చేసుకుందాం.. అభివృద్ధి పనులు చేపడదాం.. సహకరిస్తే అందుకు తగిన సహకారం ఉంటుంది.. పార్టీ, ప్రభుత్వ నియామక పదవుల్లో, అభివృద్ధి పనుల్లో పనులు అందిస్తాం' అంటూ కొందరు తమ ప్రత్యర్థులకు ఎర వేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడత పంచాయతీ నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తి కాగా.. ఉప సంహరణ ప్రక్రియ కొనసాగనుంది. అలాగే రెండో విడత నామినేషన్లకు దాఖలు మొదలైంది. దీంతో అందరి దృష్టి ఏకగ్రీవాలపై పడింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఏకగ్రీవం చేసుకునేందుకు ఇప్పటికే తమ తమ ప్రయత్నాలు ప్రారంభించారు. పార్టీ నాయకులు, రెబల్స్‌తో పాటు ప్రత్యర్థి పార్టీల నాయకులతోనూ మంతనాలు సాగిస్తున్నారు. కొందరికి అభివృద్ధి పనులు, ప్రభుత్వ నియామక పదవులతో పాటు వారు కోరిన వాటికి నామినేషన్ల ఉపసంహరణకు సన్నాహాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో రఘునాథపాలెం మండలం మంగ్యాతండా గ్రామ పంచాయతీ, బోనకల్ మండలంలోని కలకోట పంచాయతీ నుంచి పైడపల్లి కిషోర్ సతీమణి పైడిపల్లి అనిత, నుండి భార్గవి ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. అలాగే చింతకాని మండలం రేపల్లెవాడ పంచాయతీలో మడిపల్లి అంబిక, అదే మండలంలో రాఘవాపురం పంచాయతీ సర్పంచ్‌గా కాంపల్లి కోటమ్మ, వైరా మండలం పుణ్యపురం సర్పంచ్‌గా మరియమ్మ, మధిర మండలం సిద్దినేని గూడెం సర్పంచ్‌కు వెంకటరావమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ఇక్కడ ఒక్కొక్కరే నామినేషన్ వేశారు. ఎన్నికల సంఘం అధికారులు వీటిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆరు పంచాయతీల్లో రాఘవాపురం సీపీఐకి చెందిన మహిళ కాగా.. మిగిలిన 5 పంచాయతీలు (మిగతా 8వ పేజీలో)

టేకులపల్లిలో భారీగా గంజాయి పట్టివేత

- కారులో తరలిస్తున్న రూ.99.83లక్షల విలువ చేసే గంజాయి స్వాధీనం
- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఇల్లెందు డీఎస్పీ

7



బానోతు వీరన్న(ఫైల్)

పెట్టుబడి రాక.. అప్పు తీరక..

- శంకరగిరి తండాలో కౌలు రైతు ఆత్మహత్య
- సెల్ఫీ వీడియో తీసుకొని.. పురుగుల మందు తాగి సూసైడ్

7

సర్పంచ్‌లకు 1,142
వార్డులకు 4,054

- జిల్లాలో తొలి విడత నామినేషన్లు పూర్తి
- ఆరు సర్పంచ్, 182 వార్డు స్థానాలు ఏకగ్రీవం

మొదటి విడతలో దాఖలైన మొత్తం నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్	దాఖలైనవి	వార్డు	దాఖలైనవి
బోనకల్	22	108	210	500
కొణిజర్ల	27	194	254	632
రఘునాథపాలెం	37	254	308	795
వైరా	22	133	200	440
మధిర	27	146	236	525
ఎర్రుపాలెం	31	146	284	536
చింతకాని	26	161	248	626
మొత్తం	192	1142	1740	4054

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 27నుంచి 29వ తేదీ వరకు గ్రామ పంచాయతీ తొలివిడత నామినేషన్లను స్వీకరించారు. వీటిలో మొత్తంగా 7 మండలాల్లో 192 పంచాయతీలకు, 1740 వార్డులకు అధికారులు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల గడువు ముగిసిన శనివారం నాటికి భారీ స్థాయిలో నామినేషన్లు వచ్చిపడ్డాయి. సర్పంచ్ స్థానాలకు1142 నామినేషన్లు, వార్డులకు 4054 నామినేషన్లు అందాయి. తొలి విడత నామినేషన్ దాఖలు కార్యక్రమంలో ఒకే ఒక్క నామినేషన్ అందిన గ్రామ పంచాయతీలు 6 ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 182 వార్డులకు ఒకే ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. వీటిని ఏకగ్రీవ పంచాయతీలుగా, వార్డులుగా పంచాయతీ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అభ్యర్థుల నుంచి అందిన నామినేషన్లను ఆదివారం నుంచి అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ తర్వాత సోమవారం(1న) అప్పీళ్లు స్వీకరిస్తారు. 2వ తేదీన పరిష్కరిస్తారు. 3న నామినేషన్ల ఉపసంహరణ మధ్యాహ్నం 3గంటలలోపు చేపడతారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. గుర్తులను కూడా అదే రోజు కేటాయిస్తారు. తొలి విడతగా డిసెంబరు 11న పోలింగ్‌ను నిర్వహిస్తారు. పోలింగ్ కోసం ఇప్పటికే అధికారులు బ్యాలెట్ బాక్సులను మండల కేంద్రాలకు తరలించారు.

'రెండో విడత'లో తొలిరోజు మందకొడిగా..

● సర్పంచ్ స్థానానికి 45.. వార్డులకు 36 నామినేషన్లు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రెండో విడత ఎన్నికలకు ఆదివారం రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో రెండోవిడత జరిగే 6 మండలాల్లో 183 సర్పంచ్ స్థానాలకు, 1,686 వార్డులకు రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం నామినేషన్లను స్వీకరించగా.. ప్రక్రియ మందకొడిగా కొనసాగింది. మొదటి రోజున పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 45 నామినేషన్లు దాఖలు చేశారు. 1,686 వార్డు స్థానాలకుగాను 36 నామినేషన్లు దాఖలయ్యాయి. సోమ, మంగళవారం రెండు రోజుల్లో ఆరు మండలాల్లో నామినేషన్లను స్వీకరించనున్నారు..

తొలి రోజు దాఖలైన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	దాఖలైనవి	వార్డు స్థానాలు	దాఖలైనవి
ఖమ్మం రూరల్	21	8	202	3
కూసుమంచి	41	4	364	2
ముదిగొండ	25	9	246	9
నేలకొండపల్లి	32	3	300	4
కామేపల్లి	24	10	218	12
తిరుమలాయపాలెం	40	11	356	6
మొత్తం	183	45	1686	36

తరతరాల సర్పంచ్‌లు..

- ఆ కుటుంబంలో మూడు తరాలుగా ఎన్నికవుతున్న సర్పంచ్‌లు
- మరోసారి ఏకగ్రీవమైన కలకోట పంచాయతీ
- జిల్లాలో కాంగ్రెస్ ఖాతాలో తొలి సర్పంచ్ పదవి



ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైన పైడిపల్లి అనిత

బోనకల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకోట గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నేత పైడిపల్లి కిషోర్ కుమార్ సతీమణి అనిత కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ఇటీవల నామినేషన్ దాఖలు చేశారు. అయితే గ్రామంలోని ప్రతిపక్ష పార్టీలు గ్రామాభివృద్ధి కోసం ఏకతాటిపైకి వచ్చి నిర్ణయం తీసుకోవడంతో.. నామినేషన్లు వేయకుండా అందరూ ఏకగ్రీవానికి మద్దతు తెలిపారు. దీంతో ఎన్నిక లేకుండానే కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా అనిత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో జిల్లాలో కాంగ్రెస్ ఖాతాలో తొలి సర్పంచ్ స్థానం జమైనట్టు అయ్యింది.

ఆ కుటుంబంలో మూడు తరాలుగా వారే..

కలకోట గ్రామంలో మూడు తరాలుగా పైడిపల్లి కుటుంబం నుంచే సర్పంచ్‌లు ఎన్నికవుతూ వస్తున్నారు. 50 ఏళ్ల క్రితం పైడిపల్లి చిన రాజయ్య సర్పంచ్, సొసైటీ చైర్మన్‌గా పని చేయగా.. ఆయన కుమారుడు పైడిపల్లి వెంకటేశ్వర్లు కూడా సర్పంచ్, సొసైటీ చైర్మన్‌గా పని చేశారు. మనవడు పైడిపల్లి కిషోర్ కుమార్ కూడా సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం కిషోర్ కుమార్ సతీమణి పైడిపల్లి అనిత ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో మూడు తరాలుగా ఆ కుటుంబం కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజా ప్రతినిధులుగా పాలన కొనసాగిస్తున్నారు. గత 1984 సంవత్సరంలో పైడిపల్లి వెంకటేశ్వరరావు సర్పంచ్‌గా పని చేసిన సమయంలో ప్రత్యర్థుల చేతిలో హత్య గావించబడ్డారు. మొత్తమ్మీద వీరికి కరుడుగట్టిన కాంగ్రెస్ కుటుంబంగా మండలంలో మంచి పేరు ఉంది.

కాకతీయ షుగర్స్‌లో క్రషింగ్ ప్రారంభం

కల్లూరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌ను ఆదివారం సదరు ఫ్యాక్టరీ వైస్ ప్రసిడెంట్ చల్లగొళ్ల వెంకటేశ్వర రావు ప్రత్యేక పూజల అనంతరం ప్లాంట్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు,ప్లాంట్ ఇంజనీర్ కె.రఘునాథబాబులు మాట్లాడుతూ తమ ఫ్యాక్టరీ పరిధిలో ఈఏడాది సీజన్‌కు గాను ఒక టన్ను చెరకు మద్దతు ధర రూ.3,500 వరకు ప్రకటించటం జరిగిందన్నారు. అదే ప్రకారం 20వేల టన్నుల చెరకును గానుగా ఆడించటం జరుగుతుందని వివరించారు. 2024-25 సీజన్‌లో 47,887టన్నుల చెరకు గానుగా ఆడించగా 8.74శాతం రికవరీ వచ్చిందని తెలిపారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పంచదార రికవరీ తగ్గినా ప్రత్యామ్నాయంగా చెరకుకు మద్దతు ధరను రూ.3,500 ఇచ్చేందుకు ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు వచ్చిందని వారు వివరించారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ పరిధిలో గల రైతులందరూ విస్తృతంగా చెరకు నాటి ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు. ఇంకాను 2025-26 సీజన్‌కు గాను చెరకు పంట సాగుచేసే రైతులు నాలుగున్నర అడుగుల దూరపు చాళ్లలో విత్తనము నాటినచో ప్రతి ఎకరానికి రెండు టన్నుల విత్తనాలు ఉచితంగా అందించటం జరుగుతుందని వైస్‌ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, ప్లాంట్ ఇంజనీర్ రఘునాథబాబులు స్పష్టం చేశారు. ఇంకాను చెరకు సాగుకు ముందుకు వచ్చిన రైతులకు ఫ్యాక్టరీ ద్వారా రుణ సదుపాయాలు కల్పించటం జరుగుతుందని ఈ అవకాశమును వినియోగించుకోవాలని వారు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ అధికారులు, కేన్ అడ్వైజర్ నరసింహమూర్తి, పర్సనల్ మేనేజర్ కుమార్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


స్విచ్‌ఆన్ చేసి క్రషింగ్ ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు


గానుగా ఆడించేందుకు యంత్రంలో చెరకు వదులుతున్న అధికారులు

అభ్యర్థికి ముందే పరీక్ష..!

దమ్మపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఏదైన పార్టీకి అభ్యర్థిని ఎంపిక చేసేటప్పుడు సాధారణంగా పార్టీలో నిర్ణయించి ఆయా పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికలు కావటంతో ఆయా పంచాయతీల పరిధిలోని అభ్యర్థుల ఎంపిక స్థానికంగానే నిర్ణయించుకొని అధిష్టానానికి సమాచారం అందించటం తెలిసిందే. కానీ ఒక పంచాయతీలో సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఒక ప్రధాన పార్టీలో ఇద్దరు వ్యక్తులు పోటీపడటంతో ఎవరిని ఎంపిక చేయాలనే విషమ పరీక్ష ఎదుర్కోవటం.. ఎన్నికలకు ముందే ఆ అభ్యర్థి తొలిపరీక్ష ఎదుర్కొన్న ఘటన దమ్మపేటలోని జమేదారు బంజర్‌లో పంచాయతీలో జరిగినట్లు సమాచారం. స్థానికుల వివరాలు ప్రకారం జమేదారు బంజర పంచాయతీ నాన్ షెడ్యూల్ ఏరియా అయినప్పటికీ అధికంగా గిరిజనులు ఉన్న ప్రాంతం. రిజర్వేషన్‌లో జమేదారు బంజర జనరల్ పంచాయతీగా ఎంపిక జరిగింది. దీంతో సర్పంచ్ పదవికి అదే పంచాయతీలోని ఒక ఓసీ అభ్యర్థి, ఒక ఎస్టీ అభ్యర్థి పోటీపడ్డారు. ఆ గ్రామస్థులకు ఎవరిని ఎంపిక చేయాలనేది అర్థం కాక ఆ గ్రామంలోని ప్రధాన పార్టీకి చెందిన నాయకులు అభ్యర్థి ఎవరిని ఎంపిక చేయాలని నిబంధనలు పెట్టుకొని చీటీలు వేసుకున్నారు. వీరిలో ఒక ఓసీ వ్యక్తికి నలుగురు వ్యక్తులు ఎక్కువగా ఎన్నుకోవటంతో సర్పంచ్ అభ్యర్థిగా ఓసీ అభ్యర్థిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఎస్టీలు అధికంగా ఉన్న గ్రామంలో ఎస్టీ అభ్యర్థికి సర్పంచ్ అభ్యర్థిగా ఎంపికి కాకపోవటంతో మనస్థాపం చెందినట్లు సమాచారం.

కొత్తగూడెం జీజీహెచ్‌లో ఆర్థోస్కోపిక్ కీ హోల్ సర్జరీ


కీ హోల్ శస్త్ర చికిత్స చేసుకొని పూర్తిగా కోలుకున్న రోగులతో వైద్యులు

హెచ్‌వోడీ డాక్టర్ నరసింహారావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో తొలిసారిగా ఆర్థోస్కోపిక్‌కి హోల్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ నరసింహారావు శస్త్ర చికిత్సలు చేసుకున్న రోగులతో కలిసి ఆదివారం వివరాలు తెలియజేశారు. భద్రాచలానికి చెందిన 26ఏళ్ల ఎన్.ఠాగూర్, కొత్తగూడెం చెందిన 35 ఏళ్ల టి.స్రవంతి వివాహిత మహిళ ఇద్దరు వేర్వేరు సందర్భాలలో వారి కుడి మోకాలికి దెబ్బ తగిలి వైద్యం కోసం కొత్తగూడెం జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ డాక్టర్లను సంప్రదించారు. వైద్యులు వారికి పరీక్షలు నిర్వహించి ఏసీఎల్ లిగమెంట్ పూర్తిగా దెబ్బతిన్నదని నిర్ధారించారు. వారికి ఇటీవలే ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, మత్తు వైద్యుడు డాక్టర్ రమేష్, స్టాఫ్ నర్స్ రాజేష్ వైద్య బృందం అధునాతన ఆర్థోస్కోపిక్ కీ హోల్ సర్జరీ (ఆల్ ఇన్సైడ్ టెక్రిక్) ద్వారా ఏసీఎల్ లిగమెంట్‌కు శస్త్రచికిత్స చేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి మోకాలికి చేసుకున్న శస్త్రచికిత్సతో పూర్తిగా కోలుకొని ఆరోగ్యంగా నడవడం ప్రారంభించారు. ఇలాంటి అధునాతన శస్త్రచికిత్సలు కొత్తగూడెం జనరల్ ఆసుపత్రిలో నిర్వహించడానికి పూర్తి సహకారం అందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీహరిరావు, వైద్యులు ఎం.రాధామోహన్, రమేష్ బృందంకు హెచ్‌వోడీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి : ఐటీడీఏ పీవో

భద్రాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యాభివృద్ధితో పాటు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. ఆదివారం భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, పీడీ, పీఈటీలకు తొమ్మిది రోజులుగా సాగుతున్న కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా సామర్థ్యాల పెంపునకు ప్రతీ ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ అశోక్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరునాయక్, ఏసీఎంవో రమేష్, ఎస్సీఆర్‌పీ మోతీలాల్ పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ


భద్రాద్రి జిల్లా పద్మశాలి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పద్మశాలి ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంఘం ఎన్నిక ఆదివారం కొత్తగూడెంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఆనంతుల లక్ష్మీనారాయణ ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దూలం నటరాజ్, అసోసియేట్ అధ్యక్షుడిగా గొట్టి ముక్కుల మహేందర్, కోశాధికారిగా షట్ట లింగమూర్తి, ఉపాధ్యక్షులుగా బేతి రమేష్, కొండి పద్మజ, కొండ సర్వేశ్వరరావు, వేముల మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాతాల వెంకటేశ్వర్లు, పెంటి సురేష్‌కుమార్, దాసరి సమ్మయ్య, పొరండ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజేషనల్ సెక్రెటరీగా పసునూతి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా వన్నాల విద్యాసాగర్, మెర్గు ఉమాశంకర్, లలిత లక్ష్మీ తదితరులు ఉన్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పసునూతి వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

రుద్రంపూర్‌లో జిల్లాస్థాయి ఈత పోటీలు

అసోసియేషన్ సెక్రెటరీ హనుమంతురాజు


రుద్రంపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చుంచుపల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులకు రుద్రంపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఈత పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ప్రకటిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రెటరీ హనుమంతురాజు ఆదివారం తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 8, 9 తేదీల్లో అదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని, వీరిని స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనరసింహ, ట్రెజరర్ పాస్నెట్, కోచ్‌లు సంధ్యారాణి, శ్యాముల్ సామంత్, కమిటీ మెంబర్ రాంబాబు, నరహరిరాజు అభినందించారు. మొత్తం 22 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి.

బాలురు గ్రూప్-1 విభాగంలో: సాయిశ్రీ వత్సవ్, ఆశిష్ వేల్సన్, చైతన్య స్థానం సాధించారు.

గ్రూప్-2 విభాగంలో: భగవత్, శశిరామ్, అద్యాన్ సాయితేజ ఉన్నారు.

గ్రూప్-3 విభాగంలో : మోక్ష, ప్రతీక్‌సింగ్, భవిష్, సాయి శ్రీధవ్, వెంకట రేశ్వంత్ ఉన్నారు.

బాలికలు గ్రూప్-3 విభాగంలో : దేదీప్య సాయి, ఝాన్వికలు ఎంపిక అయ్యారు.

బాల సాహిత్య వేదికపై ప్రతిభ చాటిన ఆదివాసీ బాలిక

భద్రాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో వర్చువల్‌గా ఆదివారం జరిగిన ప్రపంచ బాల సాహిత్య వేదికపై భద్రాచలంలోని యజ్ఞా పాఠశాలలో 8వ చదువుతున్న విద్యార్థిని మడివి గురుత్వ సమందా సింగ్ ప్రతిభ చాటారు. కథా విభాగంలో కోయజాతి ప్రతినిధిగా ఆమె కోయ సంప్రదాయ వేషధారణలో పాల్గొని పేన్ పండుగ ఇతివృత్తం ఆధారంగా పేన్ పండుం అడవి రహస్యం కథను వినిపించారు. ఈ కథలో ఆదివాసీ మూలాలను, వారి తత్వం, పూర్వికుల ఆరాధనలతో పాటు ప్రకృతి ధర్మాన్ని పోరాట వారసత్వాన్ని ఆరాధించే విశిష్ట వైభవాన్ని మూడు నిమిషాల నడివిలో చాటి చెప్పారు. బాలికను తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్, బాలిక తండ్రి మడివి నెహ్రూలు అభినందించారు.


గిరిజన సంప్రదాయ వేషధారణలో కథను వివరిస్తున్న మడివి గురుత్వ సమందా సింగ్

ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి

కూసుమంచి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలని ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమాధికారి జ్యోతి తెలిపారు. ఆదివారం కూసుమంచిలోని బీసీ వసతిగృహంలో ఖమ్మం డివిజన్ పరిధిలోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యారులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి జీపీఏను సాధించాలని తెలిపారు. ఇష్టపడి చదవాలని అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏబీసీడీవో గ్రేసమ్మ, వెంగళరావు, కూసుమంచి సంక్షేమాధికారి వీరబద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు స్పందన

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్14, 16 బాలికల అథ్లెటిక్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను రైల్వే సీఐ అంజలి ప్రారంభించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సత్యనారాయణ రెడ్డి, షఫి, కృష్ణయ్య, శ్రీనివాస్, ముజాహిద్, వెంకటేశ్వర్లు, కోచ్ గౌస్, ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.


పరుగుపోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

'స్కూల్ ఆఫ్ మైన్స్' నుంచి ఎర్త్ సైన్స్‌గా..

(5వ పేజీ తరువాయి)

గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆమోదం తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచనలతో రూపొందించిన ప్రతిపాదనను ప్రభుత్వం నిపుణులతో ఆరు నెలల పాటు పరిశీలించి, సాధ్యతా నివేదిక ఆధారంగా అసెంబ్లీలో యూనివర్సిటీని ప్రకటించిందన్నారు. ఖనిజ సంపదలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ సంపద లభ్యమయ్యే ప్రాంతంగా ఉండడంతో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనకు అత్యుత్తమ ప్రదేశమైందన్నారు. దేశ ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలను గౌరవిస్తూ యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ఇందుకు మంత్రివర్గం, అసెంబ్లీ ఆమోదించాయన్నారు. జాతీయ రహదారి పక్కనే అభివృద్ధి చెందుతున్న ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పరిశోధనా సంస్థగా నిలవనున్నదని తెలిపారు.

కొత్తగూడెం, ఇల్లెందు, హైదరాబాద్ జాతీయ రహదారి నిర్మాణానికి ఆమోదం లభించగా.. వెంటనే పనులు ప్రారంభించబడ్డాయని మంత్రి తుమ్మల తెలిపారు. భద్రాచలం, మణుగూరు, ఏటూరు నాగారం, చౌటాల రహదారి నిర్మాణం కోసం అటవీ శాఖ రెండు లైన్ల రహదారికి అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఖమ్మం కేంద్రంగా సూర్యాపేట, రాజమహేంద్రవరం, నాగపూర్, అమరావతి రహదారులు పూర్తి కానున్నాయని, వాటితోపాటు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అభివృద్ధి కోసం రింగురోడ్లు కూడా ఆమోదం లభించిందన్నారు. కొత్తగూడెం బైపాస్ రహదారి కోసం 420 కోట్ల రూపాయలతో జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌లో భాగంగా డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణానికి అవసరమైన రూ. 3400 కోట్ల నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు. పినపాక, మరెళ్లపాడు, తుమ్మలచెరువు, సిగంభూపాలెం, అశ్వరావుపేట, అన్నదైవంపాడు, ముకమామిడి ప్రాంతాల్లోని పలు ప్రాజెక్టుల అనుసంధానంగా డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. తద్వారా వైరా, సత్తుపల్లి, మధిర, అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాలకు గోదావరి జలాలు అందనున్నాయన్నారు. పాల్వంచలో గడువు పూర్తయిన విద్యుత్ ప్లాంట్ల స్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పర్యావరణ హిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదించినట్లు తెలిపారు. మెడికల్ కాలేజీలో హాస్టల్ సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, మరి కొద్ది రోజుల్లో మంజూరు అవ్వనున్నట్లు తుమ్మల తెలిపారు. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రారంభోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముందుగా శిలాఫలకం ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. యూనివర్సిటీ ప్రాంగణాన్ని పర్యవేక్షించి, జరుగుతున్న పనుల పురోగతిని వివరంగా తెలుసుకున్నారు. సభాస్థలాన్ని సందర్శించిన మంత్రి.. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని సూచనలు ఇచ్చారు.

ప్రజల్లో సంతోషం కలిగింది: ఎమ్మెల్యే కూనంనేని

అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. పాల్వంచ పునరుజ్జీవంలో భాగంగా విద్యుత్ ఉపకేంద్రాల మంజూరు ప్రజల్లో సంతోషాన్ని కలిగించిందన్నారు. కొత్తగూడెం పట్టణంలో సింగరేణి సహకారంతో నూతన బస్టాండ్‌ను నిర్మించేందుకు, పాల్వంచలో జెన్‌కో సహకారంతో ఆధునిక బస్టాండ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రతిబింబించేలా అన్ని సౌకర్యాలతో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్తగూడెం జిల్లాలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపన ఎంతో గర్వకారణమన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనను అత్యుత్తమంగా నిర్వహించేందుకు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవో మధు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల భయం.. బకాయిల భారం

(5వ పేజీ తరువాయి)

చేసిన పనులకు రూ.90లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎకరం పొలం అమ్మి కొంత తీర్చాడు. బయ్యన్నగూడెం పంచాయతీలో మాజీ సర్పంచ్ భర్త కోమటి ప్రసాద్‌కు రూ.30లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఇదే మండలంలోని కొత్తకారాయిగూడెం మాజీసర్పంచ్ భర్త దొడ్డపునేని రవికుమార్‌కు రూ.60లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. కల్లూరు మండలంలో కూడా పలు గ్రామాల పంచాయతీలకు బిల్లులు పెడింగ్‌లో ఉన్నాయి. చిన్నకోరుకొండిలో పల్లె ప్రగతి తదితర అభివృద్ధి పనులకు రూ.8లక్షలు బిల్లులు రావాలి. వైఎస్‌పురం మాజీసర్పంచ్‌కు కూడా 40లక్షలు బిల్లులు రావాల్సి ఉంది. కప్పలబంధంలో రూ.15 లక్షలు, మర్లపాడు మాజీ సర్పంచ్‌కు రూ.8లక్షల బిల్లులు అందాలి. అలాగే జిల్లాలో పాలేరులోని పలు మండలాల్లో కూడా మాజీ సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. వైరా నియోజక వర్గంలోని కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావుకు రూ.25 లక్షల బకాయి రావాలి.. ఎస్ఎఫ్ఎసీ జనరల్ ఫండ్‌తోపాటు సీసీ రోడ్లు, బకాయిలు రావాల్సి ఉంది.

● ఏన్కూరు మేజర్ గ్రామ పంచాయతీలో మాజీ ఉప సర్పంచ్ వేముల రమేష్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేశాడు. ఈయనకు రూ.50 లక్షల వరకు బకాయి రావాలి. ఇదే మండలంలోని భగవాన్ నాయక్ తండాలో రూ. 6 లక్షల బకాయి రావాల్సి ఉంది. తిమ్మరావుపేట పంచాయతీలో మాజీ సర్పంచ్ చేపట్టిన పనులకు రూ. 5 లక్షలు రావాల్సి ఉంది.

● మధిర మండలం దెందుకూరు పంచాయతీలో మాజీ సర్పంచ్ కోట విజయశాంతికి రూ. 23.70 లక్షల బకాయి రావాల్సి ఉంది. సీసీ రోడ్లు, చెరువు పూడిక తీత, అంగన్ వాడీ భవనాలు, టాయ్‌లెట్లు తదితర పనులు చేశారు. ఇదే మండలం తొండల గోపారం మాజీ సర్పంచ్ పింగళి శ్రీదేవికి రూ. 7 లక్షల బకాయి రావాలి. గ్రావెల్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల పనులకు సంబంధించి ఈ బకాయి ఉంది. మధిర మండలం మల్లారం పంచాయతీలో మాజీ సర్పంచ్ ఉపేంద్రకు రూ. 11 లక్షల రూపాయల బకాయిలు రావాలి. చింతకాని మండలం లచ్చగూడెం మాజీ సర్పంచ్ గురజాల ఝాన్సీకి సీసీ రోడ్లకు రూ.10 లక్షల బకాయి ఉంది. చింతకాని మండలం నాగులవంచ పంచాయతీలో ఆల స్యం నాగమణికి రూ. 20 లక్షల బకాయి ఉంది.

● ఖమ్మం రూరల్ మండలం ఎం .వెంకటాయపాలెం మాజీ సర్పంచ్ ఎం. సంధ్యారాణికి సీసీ రోడ్లకు సంబంధించి రూ. 14 లక్షల బిల్లు బకాయి రావాల్సి ఉంది.

● కూసుమంచి మాజీ సర్పంచ్ చెన్న మోహన్‌కు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మానలకు సంబందించి రూ. 20 లక్షల బకాయి రావాల్సి ఉంది.

● కామేపల్లి మండలం మద్దుల పల్లి పంచాయతీలో గ్రావెల్ పనులు, పునర్‌నిర్మాణం, డీజిల్ బిల్లులు కు సంబందించి మాజీ సర్పంచ్ పులసం జయమ్మకు రూ.40 లక్షల వరకు రావాల్సి ఉంది.

● బర్లగూడెం సర్పంచ్ మోడు రాధకు రూ. 15 లక్షల బకాయి రావాల్సి ఉంది. రామకృష్టాపురం పంచాయతీలో మాజీ సర్పంచ్ జర్పుల రామారావుకు స్మశాన వాటిక పనులు, గ్రావెల్ పనులకు సంబందించి 15 లక్షల వరకు రావాల్సి ఉంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ..

గ్రామ పంచాయతీల్లో గత పాలకవర్గాలతో పాటుగా, గడిచిన రెండేళ్ల కాలంలో పంచాయతీ కార్యదర్శులు పనిచేసిన పలు పనులకు సంబంధించి పెద్ద ఎత్తున బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతీ పంచాయతీలోనూ రూ. లక్షల్లో బకాయిలు పేరుకుపోయాయి. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ సర్పంచ్‌లు చేసిన పనులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ప్రత్యేక అధికారుల పాలన సమయంలో చేసిన పనులకు సైతం బిల్లుల చెల్లింపులు జరగలేదు. దీంతో ఒక్కో నియోజకవర్గంలో బకాయిలు రూ. కోట్లలోనే ఉన్నాయి. కాగా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న క్రమంలో కొత్త పాలకవర్గాలు ఏర్పడుతున్న నేపథ్యంలో రూ. లక్షల్లో పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులు వస్తాయోలేదోనన్న ఆందోళనలో మాజీ సర్పంచ్‌లు ఉన్నారు. ఉదాహరణకు.. అశ్వారావుపేట నియోజకవర్గంలోని 105 గ్రామ పంచాయతీలకు సంబంధించి రూ. 7.46 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అశ్వారావుపేట మండలంలో 30 పంచాయతీల్లో సుమారు రూ. 2 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఆ మండలంలోని వేదాంతపురం పంచాయతీలో రూ. 10 లక్షలు, తిరుమలకుంట పంచాయతీలో రూ. 12 లక్షల బకాయిలు ఉన్నాయి. దమ్మపేట మండలంలో 31 గ్రామ పంచాయతీలలో రూ. 2.5 కోట్ల బకాయిలు ఉండగా.. ఒక్క దమ్మపేట పంచాయతీలోనే రూ. 25 లక్షలు బకాయి ఉంది. ములకలపల్లి మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో రూ. 1.20 కోట్లు బకాయిలు ఉండగా, కేవలం ముల్కలపల్లిలోనే రూ. 37 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో రూ.91 లక్షలు, చంద్రుగొండ మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో రూ.85 లక్షలు బకాయిలు ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా మాజీ సర్పంచ్‌ల పదవీకాలంలో జరిగినవే.

సంవేదనల అక్షర రూపం కవిత్వం

» సాహిత్య విమర్శకుడు గుంటూరు లక్ష్మీనర్సయ్య

ఖమ్మం అర్బన్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అస్తిత్వసంవేదనలకు అక్షర రూపమే కవిత్వమని ప్రముఖ సాహిత్య విమర్శకుడు గుంటూరు లక్ష్మీనర్సయ్య అన్నారు.. ఖమ్మంలోని న్యూ ఇరా స్కూల్‌లో ఆదివారం శివారెడ్డి స్ఫూర్తి పురస్కార ప్రధానత్సవ ఘనంగా జరిగింది.. యువకవి గూండ్ల వెంకటనారాయణ రచించిన ద్రావిడ సముద్రం కవిత్వ సంపుటికి గానూ ఈ అవార్డును అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన ఈసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం, కథారచయిత ధరణి కోటరమేష్ ప్రసంగించారు. యువకవి అనిల్ డానీ ద్రావిడ సముద్రం పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో విద్యావేత్తలు రవి మారుత్, అబద్‌ఆలీ కవులు షకూర్, కపిలరాంకుమార్, ఎంవీ రమణ, కట్ట శ్రీనివాస్, షఫి, దాసరోజుశ్రీనివా స్, సుభాషిణి తోట, హిమబిందు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనం



ఖమ్మం స్పోర్ట్స్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్నేరు ఈత మిత్రు ల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఈత మిత్రుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సా హంగా జరిగింది. సమ్మేళనంలో సుమారు 150 మంది స్విమ్మర్లు పాల్గొని ఆటపాటలతో నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో మున్నేరు ఈత మిత్రుల సంఘం బాధ్యులు కోదాటి గిరి, సీనియర్ స్విమ్మర్‌లు బోజెడ్ల ప్రభాకర్, కనకం జనార్ధన్, మందలపల్లి లక్ష్మణ్, అనుముల రాంరెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పారాయణం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గీత జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలో నర్తకి శ్రీ మురళీకృష్ణ మందిరంలో భగవద్గీత 700 శ్లోకాల సామూహిక పారాయణం నిర్వహించారు. ఈ పారాయణంలో 1200 మంది ఏకకంఠంతో మూడు గంటల సేపు కూర్చొని 700 శ్లోకాలు పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, కృష్ణ భక్తులు, హిందూ ధార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొని విజయవంతం కోరారు. మురళీకృష్ణ మందిరం చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, బోనాల రామకృష్ణ, తదితరులున్నారు.

సింగరేణి కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలి

(5వ పేజీ తరువాయి)

డబ్ల్యూసీఎల్ టీమ్‌కు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి. సూర్యనారాయణ, మోకాళ్ల తిరుమల రావు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు, గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు త్యాగరాజన్, జీఎంలు జీవి. కిరణ్ కుమార్, ఎం. సుబ్బారావు, ఎస్ఓటూ జీఎం. కోటిరెడ్డి, ఏజీఎం రామకృష్ణ, కార్మిక సంఘం నాయకులు మల్లిఖార్జున్‌రావు, ఎండి. రజాక్, సింగరేణి క్రీడాకారులు , కార్మికులు, సమీప ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

● **సింగరేణి కెప్టెన్ కార్తీక్‌కు తీవ్ర గాయాలు..**

కోల్ ఇండియా కబడ్డీ పోటీల సెమీ ఫైనల్స్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ కెప్టెన్ కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఫైనల్స్‌లో డబ్ల్యూసీఎల్ టీమ్‌తో తలపడుతుండగా.. కూతకు పోయిన సమయంలో ఆటలో కింద పడిపోవడం, మిగితా క్రీడాకారులు కార్తీక్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వైద్య చికిత్స నిమిత్తం సింగరేణి ప్రధాన ఆసుపత్రికి తరలించారు. కార్తీక్‌కు బలమైన గాయాలు కావడంతో.. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. కబడ్డీ పోటీల్లో గాయాలపాలైన క్రీడాకారుడు కార్తీక్‌ని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి చైర్మన్ కార్తీక్ రామకృష్ణాపూర్‌లోని ఆర్‌కె-7 మైన్‌లో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సింగరేణి అధికారులు సైతం కార్తీక్‌ను పరామర్శించారు.

రాజుపేట బజారు పంచాయతీ కార్యాలయం, ఈశ్వరమాధారం పంచాయతీ కార్యాలయం





సాధారణంగా ఒక ఊరికి ఒకే పేరు ఉంటుంది. కానీ ఆ ఊరిలో మాత్రం ఇళ్లు పక్కపక్కనే ఉన్నా రెండు గ్రామాల పరిధిలోకి వస్తాయి. గ్రామాల పేర్లు, పంచాయతీ కార్యాలయాలూ వేరువేరుగా ఉన్నాయి. ఇవి చూడటానికి ఒకే గ్రామంగా కనిపించినా గ్రామాల మధ్యఉన్న సీసీ రోడ్డు బోర్డర్‌లైన్‌గా మారి ఊరి మధ్యలోనుంచి వెళ్లడంతో రెండు పంచాయతీలుగా ఏర్పాటయింది. అవే ఖమ్మంజిల్లా కూసుమంచి మండలంలోని రాజుపేట బజారు, ఈశ్వరమాధారం గ్రామ పంచాయతీలు.

ఒక్కటే ఊరు.. పంచాయతీలు వేరు..!

గ్రామం మధ్యలో సరిహద్దు లైన్‌గా సీసీ రోడ్డు



రెండు పంచాయతీలను విడదీస్తున్న సీసీ రోడ్డు

కూసుమంచి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసింది. అదే సమయంలో పెద్ద గ్రామపంచాయతీలను సైతం పరిపాలనా సౌలభ్యం కోసం విడదీసి కొత్తగా గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. గతంలో ఈశ్వరమాధారం గ్రామపంచాయతీ పరిధిలో ఈశ్వరమాధారం, మంగలితండా, మండడి నర్సయ్యగూడెం, మద్దివారిగూడెం గ్రామాలు కలిసి అత్యధికంగా 2 వేలకు పైగా ఓటర్లు ఉన్నాయి. పెద్ద పంచాయతీగా ఉందని భావించిన అధికారులు దానిని విడదీసి ఈశ్వరమాధారం గ్రామంలో సగభాగంతో పాటు మద్దివారిగూడెం, మండడి నర్సయ్యగూడెం కలిపి ఒక గ్రామపంచాయతీగా (1033 మంది ఓటర్లతో) ఏర్పాటుచేశారు. అదే విధంగా మంగలితండాను (838 మంది ఓటర్లు) కొత్త పంచాయతీగా ఏర్పాటుచేశారు. అదేవిధంగా ఈశ్వరమాధారంలో సగభాగం ఊరును, తాళ్లగడ్డతండాను కలిపి 598మంది ఓటర్లతో రాజుపేట బజారు అనే కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయితే ఈశ్వరమాధారం గ్రామం ఒక్కటిగానే కనిపిస్తున్నా వేరువేరు పంచాయతీలుగా ఉన్నాయి.

రెవెన్యూ, పోలీసులకు సంబంధించిన పాలనాపరమైన కార్యకలాపాలు తప్ప మిగతా అన్ని కార్యక్రమాలు, పండుగలు అన్నీ కలిసే జరుపుకుంటారు. ఈశ్వరమాధారం, మంగలితండా పంచాయతీల రిజర్వేషన్ జనరల్ అయ్యాయి. రాజుపేట బజారు పంచాయతీ ఎస్టీ మహిళకు ఖరారయింది. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఒకగ్రామానికి సంబంధించిన ఎలక్షన్లతో మరో జీపీ ప్రభావం ఉండే అవకాశం ఉంది.

పల్లె సమరం 2025

సర్పంచ్ అధికారాలు, విధులు ఇవీ..


ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పల్లెల్లో ఎక్కడచూసినా పంచాయతీ ఎన్నికల సందడే.. ఎక్కడ చూసినా ఓట్ల గురించే చర్చ. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఇచ్చే నజరానాకు ఆశపడకుండా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన నేతను ఎన్నుకోవాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రధాని, ముఖ్యమంత్రి, జిల్లా పరిషత్, మండల పరిషత్ అధ్యక్షుడి కంటే సర్పంచ్ పాత్రే కీలకం. పంచాయతీరాజ్ చట్టం సర్పంచ్‌ల అధికారాలతో పాటు నిర్వర్తించాల్సిన బాధ్యతలను స్పష్టంగా నిర్వచించింది. విధి నిర్వహణలో సర్పంచ్‌లకు విశిష్ట అధికారాలున్నాయి. అకారణంగా కోర్టులో కేసులు వేసేందుకు వీల్లేకుండా రక్షణ కూడా ఉంటుంది. అలాగే గ్రామాభివృద్ధిలో పంచాయతీ పాత్ర, సర్పంచి అధికారాలు, బాధ్యతల వివరాలు..

సర్పంచ్ విధులు ఇలా..

- పంచాయతీ భవనాలనిర్మాణం, మరమ్మతులు, పంచాయతీ రోడ్లు, కల్వర్టుల నిర్వహణ.
- మురుగుకాల్వల నిర్మాణం, మరమ్మతులు, వీధుల శుభ్రం, వీధి దీపాల ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ.
- మరుగుదొడ్ల ఏర్పాటు, సామూహిక బావుల మరమ్మతులు, పూడికతీత, జనన, మరణాల నమోదు.
- మలేరియా, అతిసారం వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడం.
- శ్మశానవాటికల నిర్వహణ, అనాథ శవాల దహన సంస్కారాలు.
- పశువుల దొడ్ల ఏర్పాటు, ధర్మశాలలు, అతిథి గృహాల నిర్మాణం, నిర్వహణ.
- రహదారుల వెంట మొక్కల పెంపకం, విద్య, ఆరోగ్య, విద్యాభివృద్ధి, వైద్యశాల, ఆటస్థలాల నిర్వహణ..
- గ్రామస్థాయిలో గ్రంథాలయాల ఏర్పాటు, వ్యవసాయ విధానాల మెరుగుపై ప్రచార కార్యక్రమాలు.
- సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించుట, జాతరలు, ఉత్సవాల నిర్వహణ,
- ప్రకృతి వైపరీత్యాల్లో సాయం, కుల, మత వివక్ష లేకుండా జీవనం గడిపేలా గ్రామసులను ప్రోత్సహించడం.
- నిరుద్యోగుల వివరాల సేకరణ, శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేకంగా దృష్టిసారించడం.

సర్పంచ్ అధికారాలు..

- ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఏ పనినైనా వెంటనే చేపట్టే అధికారం సర్పంచులకు ఉంటుంది. - పంచాయతీల కార్యనిర్వహణ అధికారి(ఈవో)తో చర్చించి నిర్ణయాలు తీసుకోవచ్చు.
- పంచాయతీ దస్త్రాల పరిశీలన, తనిఖీ అధికారం, గ్రామపరిధికి సంబంధించిన ఏ సమాచారాన్నైనా తెప్పించుకోవచ్చు.
- ఈవో తదితర సిబ్బంది కార్యకలాపాలపై సర్పంచిదే అజమాయిషీ ఖాళీ అయిన ఉపసర్పంచి ఎన్నికల నిర్వహణ చేసే బాధ్యత కూడా సర్పంచికే ఉంటుంది.
- పంచాయతీ నిధుల డ్రా, పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టు పద్ధతిన కేటాయించే అధికారం.
- మైనర్ పంచాయతీల్లో రూ. లక్ష, మేజర్ పంచాయతీల్లో రూ.2 లక్షల విలువైన పనులకు పాలనాపరమైన అనుమతి మంజూరు.
- సిబ్బంది బదిలీ, వార్షికాదాయం రూ.10 లక్షలు మించితే కంప్యూటర్ కొనుగోలుకు అవకాశం ఉంది.
- అత్యవసరమైతే మైనర్ పంచాయతీల్లో రూ. ఐదువేలు, మేజర్ పంచాయతీల్లో రూ.10 వేల వరకు ఖర్చుచేసే అధికారం సర్పంచికే ఉంటుంది.



పోరుకు మొదటిసారి దూరం

ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆ పంచాయతీ ఏకగ్రీవమే
మున్సిపాలిటీలో కలవడంతో పంచాయతీ ఎన్నికలకు దూరమైన గ్రామం



తెల్దారుపల్లి గ్రామ పంచాయతి కార్యాలయం

ఖమ్మంరూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): 1957లో ప్రారంభమైన గ్రామ పంచాయతీల ఎన్నికలకు సంబంధించి నాటి నుంచి నేటి వరకు ఆ పంచాయతీలో ఎన్నికలు జరిగిన దాఖలాల్లేవు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. ఇక్కడ సుమారు 68 ఏళ్లగా ఎన్నికలు జరగలేదు. కానీ మొదటిసారి ఆ గ్రామం పంచాయతీ ఎన్నికలకు దూరం అయింది. కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండే గ్రామమే ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలంలోని తెల్దారుపల్లి గ్రామం. సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, కేంద్రకమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం స్వగ్రామం అయిన తెల్దారుపల్లి. ఈ పంచాయతీలో ఇప్పటివరకు 13సార్లు జరగగా ఒక్కసారి కూడా ఎన్నిక జరగలేదు. ప్రస్తుతం జరిగే పంచాయతీ ఎన్నికలకు మొదటిసారి దూరమయింది. ఈ ఏడాది జనవరిలో నూతనంగా ఏర్పాటైన ఏదులాపురం మున్సిపాలిటీలో తెల్దారుపల్లి గ్రామం కూడా విలీనం కావడంతో ఎన్నికలకు దూరం కావాల్సి వచ్చింది. ఆ గ్రామంలో మొత్తం 3,300 ఓటర్లు ఉంటారు. వీరు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏనాడు తమ ఓటు హక్కు వినియోగించుకున్న దాఖలాల్లేవు. అయితే మండలంలో ఎప్పుడు పంచాయతీ ఎన్నికలు వచ్చినా ఏకగ్రీవంగా ఉండే గ్రామం ఈసారి దూరం కావడంతో ప్రజలు చర్చింకుంటున్నారు.

జనరల్ సీటులో గిరిజనులకే అవకాశం

అల్లిగూడెం పంచాయతీలో విచిత్ర పరిస్థితి

అశ్వారావుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అదో గిరిజన గ్రామం. అశ్వారావుపేట మునిసిపాలిటీని ఆనుకొని వున్న చిన్న గ్రామం. మొత్తం 100 కుటుంబాలు, 300 ఓట్లు మాత్రమే కలిగివున్న ఓ గిరిజన గ్రామం. 2019లో జరిగిన పంచాయతీల విభజన సమయంలో పాత అల్లిగూడెం, కొత్తఅల్లిగూడెం, మద్య అల్లిగూడెంలను కలపి కొత్త పంచాయతీని ఏర్పాటు చేసారు. ఈ పంచాయతీకి మొదటి సారి గిరిజనులకు రిజర్వుకావడంతో మొడియం కృష్ణవేణి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ పంచాయతీకి రెండవ సారి ఎన్నికలు జరుగుతుండగా రొటేషన్ పద్దతిలో ఈ పంచాయతీ జనరల్ స్థానంగా ఎన్నికల కమీషన్ ప్రకటించింది. జనరల్ స్థానమైన అల్లిగూడెం పంచాయతీలో గిరిజనేతర కుటుంభాలు రెండు మూడు మాత్రమే ఉన్నప్పటికి వారు రాజకీయాలపై పెద్దగా ఆసక్తి కనపరచకపోవడమే కాక 99 శాతంకు పైగా గిరిజన ఓటర్లే ఈ గ్రామంలో ఉండటంతో రాజకీయ పార్టీలు గిరిజన అభ్యర్థులనే పోటీలో నిలిపేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మద్దతు దారులు ఆయా పార్టీల నుండి పోటీ చేసే అభ్యర్థులను ఎంపిక చేసుకొని నామినేషన్లుకు సిద్దమవుతున్నారు. సాధారణంగా జనరల్ సీటులో అభ్యర్థుల ఎంపికనుండే ప్రతిష్టాత్మకమైన పోటీ ఉంటుంది. కాని అల్లిగూడెం పంచాయతీలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. జనరల్ స్థానమైన అల్లిగూడెంలో అన్ని రాజకీయ పార్టీలు గిరిజన అభ్యర్థులనే పోటీలో ఉంచేందుకు సన్నాహాలు చేస్తుండటంతో ఆ జనరల్ సీటులో గిరిజన అభ్యర్థులే సర్పంచ్ కానున్నారు. అల్లిగూడెం పంచాయతీలో సాధారణ పరిస్థితులకు భిన్నంగా విచిత్రమైన పరిస్థితులు ఏర్పడటం చర్చనీయాంశంగా మారింది.



అల్లిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం

మహిళా రిజర్వుడ్ స్థానంలో పురుషుడి నామినేషన్

చింతిర్యాల పంచాయతీలో ఘటన

అశ్వాపురం నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతిర్యాల పంచాయతీలో వింత సంఘటన చోటుచేసుకుంది. చింతిర్యాల పంచాయతీలో నామినేషన్ల పరిశీలన సందర్భంగా మహిళా రిజర్వు స్థానంలో ఓ పురుషుడు నామినేషన్ వేయటంతో అధికారులు అతని నామినేషన్‌ను తిరస్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. చింతిర్యాల పంచాయతీలో మొత్తం 8వార్డులు ఉన్నాయి. 5వ వార్డు జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టం నాగమణిని బలపర్చగా, కట్టా గాంధీని బీఆర్ఎస్ బలపర్చింది. స్క్రూట్నీ సందర్భంగా అధికారులు మహిళ స్థానంలో నామినేషన్ వేసిన గాంధీ నామినేషన్‌ను తిరస్కరించటంతో కాంగ్రెస్ పార్టీకి ఆ వార్డు దక్కింది.

పుణ్యపురం సర్పంచ్‌గా మరియమ్మ ఏకగ్రీవం

వైరా, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని పుణ్యపురం గ్రామ పంచాయతీ ఏకగ్రీవం అయింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన యంగల మరియమ్మ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. చివరిరోజు శనివారం సర్పంచ్ అభ్యర్థిగా మరియమ్మ, 8 వార్డులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. దాంతో పుణ్యపురం సర్పంచ్ సహా 8వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. కాంగ్రెస్‌కు చెందిన మరియమ్మ సర్పంచ్ కాగా, టీడీపీకి చెందిన రెండోవార్డు మెంబర్ బట్టా రాఘవులు ఉపసర్పంచ్ ఎన్నిక లాంఛనప్రాయం మాత్రమే. వార్డు సభ్యులుగా కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు వార్డు సభ్యులు నాగనబోయిన పుల్లయ్య, వాకదాని కృష్ణవేణి, ఆవుల తిరుపతమ్మ, కంభంపాటి లక్ష్మీ, సౌందర్య, టీడీపీకి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు బట్టా రాఘవులు(ఉప సర్పంచ్), వాకదాని వెంకటనర్సయ్య,కంభంపాటి అప్పారావు ఏకగ్రీవం అయ్యారు.



మరియమ్మను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

మరియమ్మకు ఎమ్మెల్యే సన్మానం

సర్పంచ్‌గా ఏకగ్రీవం ఎన్నికైన యంగల మరియమ్మను శనివారం రాత్రి తమ క్యాంపు కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభినందించి సన్మానించారు. ఏకగ్రీవం చేసిన కాంగ్రెస్, టీడీపీ నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, సిరిపురం మాజీ ఎంపీటీసీ మచ్చా బుజ్జీ, పుణ్యపురం మాజీ సర్పంచ్ గద్దే మల్లికార్జున్‌రావు, టీపీసీసీ ప్రధానకార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు నాగనబోయిన కృష్ణ, యంగల కృష్ణ, జోనెబోయిన వెంకటేశ్వర్లు, వాకదాని శ్రీనివాసరావు, కట్ల సంతోష్, పణితి శ్రీను, దేనువకొండ పుల్లంరాజు, తన్నీరు కృష్ణారావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, కర్నాటి హన్మంతరావు పాల్గొన్నారు.

వైరాలో 29 వార్డులు...

వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు పంచాయతీల్లో 29 వార్డులకు ఏకగ్రీవమని అధికారులు ధ్రువీకరించారు. పుణ్యపురంలో మొత్తం 8వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. స్టేజీ పినపాకలో ఒకటి నుంచి వరుసగా ఐదు వార్డులు, నారపనేనిపల్లిలో 1,2,4,5,8వార్డులు, స్నానాల లక్ష్మీపురంలో ఆరో వార్డు, కొష్టాలలో ఆరో వార్డు, గోవిందాపురంలో 1,5,6,7,8వార్డులు, లింగన్నపాలెంలో 2, 4, 5, 6వార్డులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీమైనట్లు అధికారులు తెలిపారు.

బుగ్గవాగు ప్రాంతంలో భారీ కొండచిలువ సంచారం

ఇల్లెందుటౌన్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని బుగ్గవాగు ప్రాంతంలో భారీ కొండచిలువ సంచరిస్తుంది. రెండు రోజులుగా కొండచిలువ బుగ్గవాగు ఒడ్డు ప్రాంతంలో సంచరిస్తుడడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కొండచిలువ సంచారంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మనుషులతోటు ఇతర ప్రాణులకు కూడా తీవ్ర హాని కలిగించే కొండచిలువను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బుగ్గవాగు పరిసర ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఆదర్శ రైతు మృతి



ముళ్లపూడి సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తదితరులు

పినపాక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన ఆదర్శ రైతు ముళ్లపూడి సత్యనారాయణ (55) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. వ్యవసాయంపట్ల మక్కువతో నూతన సాగు పద్ధతులను, సాంకేతిక వ్యవసాయ మెళకువలను మండలంలోని పలువురు రైతులకు పరిచయం చేసిన వ్యక్తిగా సుపరిచితుడు. మండల ఆదర్శ రైతుగా ఆయన ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందాడు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. స్థానిక గ్రామ పెద్దలు ఆయన కుంటుంబాన్ని పలకరించి సంతాపం తెలిపారు.

బైక్ ఢీకొని లారీడ్రైవర్ మృతి



పెద్ది సురేష్(ఫైల్)

తల్లాడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : వేబ్రిడ్జి వద్ద రోడ్డుపక్కన నిలుచుని ఉన్న లారీడ్రైవర్‌ను అటుగా విచ్చిన ఓ బైక్ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈసంఘటన శనివారం రాత్రి ఖమ్మంజిల్లా తల్లాడలో జరిగింది. ఈ ప్రమాదంలో ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిని లారీడ్రైవర్ పెద్ది సురేష్(30) మృతి చెందాడు. రోడ్డుపక్కన నిలుచున్న సురేష్‌ను తల్లాడ నుంచి అన్నారుగూడెం వైపు వెళుతున్న బైక్ ఢీకొంది.. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేష్‌ను చికిత్స కోసం స్థానిక లూర్దు మాత ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్ఐ బి.వెంకటేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీల్లో

భద్రాద్రి విద్యార్థినికి ప్రథమస్థానం

భద్రాచలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన భగవత్‌గీత కంఠస్థ పోటీల శిశుస్థాయి విభాగంలో భద్రాచలంకు చెందిన చిన్నారి సిద్ధ ఊర్వికకు ప్రథమస్థానం దక్కింది. ఈ సందర్భంగా బాలికను భద్రాచలం విశ్వహిందూపరిషత్ ప్రఖండ, కార్యకర్తలు అభినందించారు. సిద్ధ ఊర్విక గొప్ప విజయాన్ని సాధించిందని, ఆది ఆమె ప్రతిభకు, పట్టుదలకు నిదర్శనమన్నారు. ఆమెను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భద్రాచలంకు చెందిన తాటిపాముల తిరుపతిరావు, కొమర్రాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

199 కేజీల గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు
- కారు, రెండు సెల్‌ఫోన్ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను



వివరాలు వెల్లడిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా- ఆంధ్రా సరిహద్దు ప్రాంతం నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్న 199.437 కేజీల గంజాయిని శనివారం సాయంత్రం టేకులపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.99.83 ఉంటుంది. ఈ ఘటనకు సంబంధించి టేకులపల్లి సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వివరాలు వెల్లడించారు. టేకులపల్లి సీఐ ఆధ్వర్యంలో టేకులపల్లి ఎస్సై రాజేందర్ సిబ్బందితో కలిసి ఇల్లెందు- కొత్తగూడెం ప్రధాన రహదారిలో టేకులపల్లి మండలంలోని సాయన్నపేట ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. అదే సమయంలో కొత్తగూడెం వైపునుంచి అటుగా వస్తున్న ఓ కారు పోలీసులను గమనించి వేగం పెంచడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును, సిమెంటు దిమ్మెను ఢీకొట్టి రెండింటి మధ్య నిలిచిపోయింది. వెంటనే పోలీసులు కారును తనిఖీ చేయగా కారు డిక్కీలో, మధ్య సీటులో 100గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. నిందితుడు (కారుడ్రైవర్) వద్ద నుంచి గంజాయితో పాటు కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కారుడ్రైవర్ (ముద్దాయి) లాల్‌సింగ్ చౌహాన్ అలియాస్ లాల్‌సింగ్‌ను విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లరి సీతారామరాజు జిల్లాలో నివాసం ఏర్పరుచుకొని స్వీట్‌షాపు నిర్వహిస్తున్నాడు. నిందితుడు లాల్‌సింగ్ చౌహాన్ గతంలో గంజాయి తరలిస్తూ ఆంధ్రప్రదేశ్ పోలీసులకి చిక్కి పలుమార్లు అరెస్టయ్యాడు. అతనిపై పలు కేసులన్నాయి. ఈ మేరకు కారు, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసి నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ చంద్రభాను తెలిపారు. ఈ సమావేశంలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, టేకులపల్లి, బోడు ఎస్సైలు రాజేందర్, శ్రీనివాసరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

చుంచుపల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి టూటౌన్ సీఐ ప్రతాప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ములకలపల్లి మండలానికి చెందిన గడప మీనాక్షి(23) చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి పంచాయతీలోని అమ్మమ్మ మట్ట భూదేవి వద్ద ఉంటుంది. ఇంట్లో నుంచి ఈనెల 26వ తేదీన మీనాక్షి బయటికి వెళ్ళింది. కుటుంబ సభ్యులు ఆ యువతి కోసం వివిధ ప్రాంతాల్లో వెతికారు. ఆమె తిరిగి ఆదివారం పెనుబల్లికి చేరుకుంది. ఇంట్లో ఏమంటారో అని అవమానంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి గడప రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు..

సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందు తాగి..
చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి
మండల పరిధిలోని శంకరగిరి తండాలో ఘటన



వీరన్న(ఫైల్)

నేలకొండపల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సేద్యం చేస్తున్న రైతులు ప్రధానంగా కౌలురైతులు పెట్టిన పెట్టుబడి రాక, అప్పులు తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అటువంటి సంఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని శంకరగిరి తండాలో జరిగింది. వివరాల ప్రకారం శంకరగిరితండాకు చెందిన బానోతు వీరన్న(28) పదెకరాలు కౌలుకు తీసుకుని వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి, చెరుకును సాగు చేస్తున్నాడు. పంటల సాగు కోసం దాదాపుగా రూ.15లక్షలు అప్పులు చేశాడు. పంట చేతికొచ్చేసరికి ధరలేక పోవటం, మార్కెట్‌లో డిమాండ్ లేక పోవటంతో, అప్పులిచ్చిన వాళ్ళకు ఎలా ఇవ్వాలో తెలియక సతమతమై. దిక్కు తోచనిస్థితిలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తండావాసులు చెపుతున్నారు.

మద్దతు ధర ఇవ్వాలి..: సెల్ఫీ వీడియోలో మృతుడు వీరన్న

రైతులు పండించిన పంటకు మద్దతు ధరను ఇవ్వాలని పురుగుల మందు త్రాగే ముందు వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియోలో ప్రభుత్వాన్ని కోరాడు. రైతుల పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నాడు. తాను తెచ్చిన అప్పులు తీర్చే దారి లేకనే గత్యంతరం లేని పరిస్థితిలో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. అనంతరం శంకరగిరితండా నుంచి మాదాపురం వెళ్ళే రోడ్డులో ఉన్న పామాయిల్ తోటలో శనివారం సాయంత్రం పురుగుల మందు త్రాగుతూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతూ తీసుకున్న సెల్ఫీని స్నేహితులు, బంధువులకు పంపాడు. దీంతో బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని, వీరన్నను చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఖమ్మంలోని ఓప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుఝామున వీరన్న మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. నేలకొండపల్లి పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పేదల ఇళ్లను కూల్చడం అన్యాయం: సీపీఎం

ఖమ్మం అర్బన్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డువిస్తరణ పేరుతో పేదల ఇళ్లను కూల్చ టం దుర్మార్గచర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు యర్రా శ్రీనివాసరావు అన్నారు. త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డువిస్తరణ బాధితుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ త్రీటౌన్‌లోని 28వ డివిజన్‌లో అవసరం లేకపోయినా రోడ్డు విస్తరణ చేపట్టి స్థానికులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు కమిషనర్లకు కక్కుర్తిపడి అవసరం లేక పోయినా రోడ్లను విస్తరించేందుకు పూనుకున్నారన్నారు. సమావేశంలో యర్రా గోపీ, భూక్యా శ్రీను, షేక్ సైదులు, షేక్ ఇమామ్, యర్రారంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ సర్పంచ్ భార్గవిని అభినందించిన మంత్రి తుమ్మల



భార్గవిని అభినందిస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం మంగ్యా తండా మాలోత్ భార్గవిని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ మాలోత్ భార్గవిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఫోన్‌లో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పంచాయతీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పైడిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగీవ సర్పంచ్ మాలోత్ భార్గవిని రాష్ట్ర యువజన నాయకుడు తుమ్మల యుగంధర్ క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాలోత్ బాల్ సింగ్, బాదవత్ గోప, బానోత్ కిషన్, భూక్యా భీమా, అంగోత్ వెంకన్న, బానోత్ భాస్కర్, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

సీపీఐలో చేరికలు

ఖమ్మంరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పల్లెగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి సుమారు 75 కుటుంబాలు సీపీఐ పార్టీలో చేరాయి. వారికి సీపీఐ రాష్ట్ర నాయకుడు మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, లింగా వెంకటనారాయణలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ మండల నాయకుడు కళ్లెం సీతయ్య, ముత్తయ్య, కృష్ణ, కొరవి, వెంకన్న, ఉప్పలయ్య, తది తరులు చేరారు. ఈ కార్యక్రమంలో కళ్లెం ముత్తయ్య, అన్నమ్మ పాల్గొన్నారు.

'ఆరోపణలు చేయడం సరికాదు'

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నేషనల్ మజ్దూర్ యూనియన్‌పై తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామని ఆ సంఘం రీజనల్ సెక్రటరీ ఎల్.రామకృష్ణారావు పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు సంబంధంలేని వ్యక్తులు ధర్నా నిర్వహించి ఆధారాలు లేని ఆరోపణలు చేసిన విషయాన్ని ఖండిస్తున్నామన్నారు. యూనియన్‌కు సంబంధం లేని వ్యక్తులు మాట్లాడడం తగదన్నారు. ఈసమావేశంలో రీజనల్ ప్రెసిడెంట్ ఆర్‌టీరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కే. వినాయకరావు, రమేస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పదునెట్టాంబడి పూజ



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు, భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మెట్ల పడిపూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ పంచలోహ పదునెట్టాంబడి పై 24వ సంవత్సరం మాలధారణ చేసిన చారుగుండ్ల కృష్ణ పద్మజ దంపతులు వారి గురుస్వామి వెంపటి సత్యనారాయణ సూచనలతో పడిపూజ ఏర్పాటు చేశారు. చైతన్యనగర్‌లోని శ్రీ ధర్మశాస్త్ర దేవాలయంలో పదునెట్టంబడిపూజ, అలంకరణ, భజన, అల్పాహారం అందజేశారు. ఆలయ మేల్‌శాంతి బ్రహ్మశ్రీ కురువక్కడ సత్యనారాయణ నంబూద్రి కేరళ శబరిమల ఆచారం ప్రకారం పూజలు నిర్వహించారు. శ్రీధర్మశాస్త్ర దేవాలయం చైర్మన్ మేకల హనుమంతరావు, కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరెడ్డి, కోశాధికారి అట్లూరి మధు, జాయింట్ సెక్రటరీ టి.వి.పుల్లంరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సరిపూడి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు వైద్యపరీక్షలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం శాస్త్ర దేవస్థానంలో ఆదివారం జాగృతి ఆస్పత్రి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని నారాయణ నంబూద్రి ప్రారంభించారు. జాగృతి ఆస్పత్రి అధినేత డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ అయ్యప్ప స్వాములకు పరీక్షలు నిర్వహించారు. సుమారు 400 మందికి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజశేఖర్ గౌడ్, చిల్లంచర్ల రాధా, నున్నా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వత్సవాయి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1977-78 వ సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు ఆదివారం ఖమ్మం నగరంలోని వీడీఓస్ కాలనీలోని ఒక ఫంక్షన్ హాల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం ఆనాటి గురువు ప్రతాపరెడ్డి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా తలసీమియా చిన్నారులకు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ, పేద నృత్య కళాకారులకు ఆర్థిక సహకారాన్ని అందజేశారు. అనంతరం ఖమ్మం లాఫ్టర్ కళాకారుడు మరికంటి వెంకట్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేస రామారావు, ఎండీ జహీరుద్దిన్, డాక్టర్ భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, డేవిడ్, భవానిశంకర్, పద్మ తదితరులున్నారు.

ఏకగ్రీవానికి ఎర

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఖాతాలో జమ కానున్నాయి. మొదట విడతగా 7 మండలాల్లో 192 గ్రామపంచాయతీలకు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే నామినేషన్ల ఉపసంహరణలోగా మిగిలిన పంచాయతీల్లోనూ ఏకగ్రీవంగా చేసేందుకు ఆయా మండలాల్లో జోరుగా మంతనాలు సాగుతున్నాయి. అధికారపార్టీకి సర్పంచ్ పదవి విపక్షపార్టీలకు ఉపసర్పంచ్ పదవులు, మెజారిటీ వార్డులు ఇచ్చేలా కొన్నిచోట్ల ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇక రెండోవిడతగా కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని 183 పంచాయతీలకు నామినేషన్ల పర్వం మొదలైంది. ఇక్కడ కూడా ఏకగ్రీవానికి మంతనాలు నడుస్తున్నాయి. ఏకగ్రీవానికి సహకరించే వారికి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కలిపించేలా ఒప్పందాలు సాగుతున్నాయి. పంచాయతీ నిధుల, పనులు సర్పంచ్ పదవి ఆశించి ఉప సంహరించుకునే వారికి కొన్నిచోట్ల ఇవ్వాలని 'ముందస్తు' ఒప్పందాలు చేసుకుంటున్నారు. పలు పంచాయతీల్లో రెబల్స్ ఉన్నచోట పార్టీనాయకులు ఇద్దరి ఆశావహులను కూర్చోబెట్టి చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి చొరవ తీసుకుంటున్నారు. మొత్తమ్మీద ఎక్కువశాతం ఏకగ్రీవం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎన్నికల్లో పోటీకి దిగితే రూ. లక్షలు ఖర్చుపెట్టే పరిస్థితి ఉన్నందు వల్ల తక్కువఖర్చుతో ఏకగ్రీవాలు చేసుకోవాలన్న అభిప్రాయం ఆశావహుల్లో వ్యక్తమవుతోంది.

ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

» స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ



నేలకొండపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

నేలకొండపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. స్థానిక సంస్థలకు రెండవ విడత జరుగుతున్న ఎన్నికల్లో భాగంగా ఆదివారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అందులో భాగంగా ఆదివారం ఉదయం నేలకొండపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ వేయటానికి వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో ఎర్రయ్యను ఆదేశించారు. కార్యదర్శి శ్రీనివాస్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి, ముజ్జుగూడెం గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను ఏడీసీపీ ప్రసాదరావు ఆదివారం తనిఖీ చేశారు. ఎస్‌ఐ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రౌడీ షీటర్ల కదలికలపై పూర్తి నిఘా పెట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ పెంటరి సంతోష్‌లు ఏడీసీపీ వెంట ఉన్నారు.

కూసుమంచి: కూసుమంచిలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సందర్శించారు. ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. నామినేషన్ల సమయంలోనే అన్ని పత్రాలను సక్రమంగా ఉన్నాయా లేదా అనేది చూసుకోవాలని సూచించారు. స్ర్కూట్నీ సమయంలో ఇబ్బందులు లేకుండా ఉంటాయని సూచించారు. టీపోస్‌లోనూ నామినేషన్ల సంఖ్య తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో జస్వంత్‌కుమార్, ఎంపీవో రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా నామినేషన్ల కేంద్రాలను కూసుమంచి సీఐ సంజీవ్ సందర్శించారు. నామినేషన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏర్పాటుచేసిన బందోబస్తుతో నిషితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. వెంట ఎస్‌ఐ నాగరాజు, అదనపు ఎస్‌ఐ దివ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంఖానాపురంహవేలి: రఘునాథపాలెం మండలంలో జరిగే మొదటి విడత నామినేషన్లకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఆదివారం జడ్పీ సీఈవో దీక్షారైనా పరిశీలించారు. మండలంలోని మల్లేపల్లి, ఈర్లపుడి, హర్యాతండ నామినేషన్ల కేంద్రాలలో నామినేషన్లను పరిశీలించారు. పరిశీలినా ప్రక్రియ నిబంధనలకు లోబడి ఉండాలని, అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రతి నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.



నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీసీపీ ప్రసాదరావు



కూసుమంచిలో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో ఆశాలత

రెండో విడత నామినేషన్లు షురూ...

ఖమ్మం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి రోజు సర్పంచ్ పదవికి 8 నామినేషన్లు ధాఖలయ్యాయి. అదేవిధంగా వార్డు మెంబర్‌లకు సంబంధించి 3 ధాఖలయ్యాయి.

నేలకొండపల్లి: మండలంలో మొదటి రోజు నామినేషన్లు మందకొడిగా సాగాయి. నామినేషన్ల స్వీకరణకు మండలంలో మొత్తం 10 క్లస్టర్లను ఏర్పాటు చేయగా, రావిగూడెం, మండ్రాజుపల్లి, కోనాయగూడెం క్లస్టర్లలో సర్పంచ్‌లకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీల మధ్యన పొత్తులకు చర్చలు నడుస్తుండటంతో మొదటి రోజు నామినేన్లు మందకొడిగా సాగాయని సమాచారం.

కూసుమంచి: పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలిరోజు ఆయాపార్టీల నుంచి నామినేషన్లు అరకొరగానే పడ్డాయి. కూసుమంచి మండలంలో 41 గ్రామపంచాయతీలు ఉండగా సర్పంచ్ పదవులకు 4 నామినేషన్లు, 364 వార్డులకు గాను 2నామినేషన్లు దాఖలయ్యాయి. మంగళవారం ఎక్కువగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది.

తిరుమలాయపాలెం : మండలంలో వివిధ గ్రామాల్లో నామినేషన్లు అభ్యర్థులు దాఖలు చేశారు. మండలంలో 40గ్రామ పంచాయతీలకు గాను 5గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవులకు ఐదుగురు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 356 వార్డులకు గాను 1 వార్డుకు నామినేషన్ దాఖలు చేశారు.

కామేపల్లి: కామేపల్లి మండల వ్యాప్తంగా ఉన్న 24 గ్రామ పంచాయితీలలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైనది. కామేపల్లిట ఎనిమిది కేంద్రాలలో నామినేషన్ దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కామేపల్లి మండలలో 24 పంచాయతీలకు గాను తొలిరోజు 10మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖాలు చేశారు. అంతేకాకుండా 218 వార్డులకు గాను 12మంది సభ్యులు నామినేషన్ దరఖాస్తు చేశారు. సోమవారం అత్యధికంగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

ముగిసిన మొదటి విడత నామినేషన్లు ...

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మొదటి విడత ఎన్నికలు జరిగే గ్రామపంచాయితిలలో నామినేసన్ల స్వీకరణ శనివారం అర్థరాత్రి వరకు సాగింది. రఘునాథపాలెం మండలం పరిధిలోని మొత్తం 37 గ్రామ పంచాయితిలలో నామినేషన్ల జోరు సాగింది. అర్థరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ సాగింది. మండల పరిధిలో 37 సర్పంచ్ స్థానాలకు మొత్తం 257 నామినేసన్లు, 308 వార్డు స్థానాలకు 795 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్ తెలిపారు.

మంగ్యాతండ పంచాయతీ ఏకగ్రీవం

రఘునాథపాలెం మండలం మంగ్యాతండ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులకు నామినేషన్ల చివరి రోజు వరకు ఒక్కో నామినేషన్ దాఖలు కావటంతో ఆ పంచాయతీ ఏకగ్రీం కానున్నట్లు తెలుస్తుంది. సర్పంచ్ స్థానానికి ఒకటి, ఆరు వార్డులకు ఆరు నామినేసన్లే దాఖలు కావటంతో ఏకగ్రీవం కానున్నది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మాలోతు భార్గవి సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ రావటంతో పాటు ఆరు వార్డులకు ఆరు నామినేషన్లే రావటంతో ఆ పంచాయతీ ఏకగ్రీం కానున్నదని అధికారులు తెలిపారు.

రఘునాథపాలెం మండలంలో జరిగే మొదటి విడత నామినేషన్లకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. 37 పంచాయితీకు గానూ అధికారులు చేపట్టిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా సర్పంచ్ స్థానాలకు 254, వార్డు స్థానాలకు 785 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో భాగంగా అందిన నామినేషన్లు అన్నీ సరైనవిగా ఎన్నికల అధికారులు తేల్చారు. నామినేషన్ల పరిశీలన అనంతరం సరైన అభ్యర్థులకు సంబందించిన జాబితాను సాయంత్రం అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. జాబితాలో పొందుపరిచిన అభ్యర్థులపై అభ్యంతరాలు ఉంటే అధికారులు సోమవారం స్వీకరించనున్నారు. రఘునాథపాలెం మండలంలో నాలుగైదు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే మండలంలోని మంగ్యాతండా గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైనది.



నామినేసన్లను పరిశీలిస్తున్న అధికారులు

భరతనాట్యంలో డిప్లొమా పరీక్షలు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భరతనాట్యంలో డిప్లొమా కోర్సు పరీక్షలు ఆదివారం నగరంలోని ఇగ్నైట్ పాఠశాలలో నిర్వహించారు. ప్రాచీనకళాక్షేత్రం చండీగడ్ విశ్వవిద్యాలయం నుంచి భరతనాట్య పరీక్షల నిర్వాహకులు డాక్టర్ ప్రతిమాసునీల్ హాజ రై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అభినయ రుద్ర నాట్యాలయం భరతనాట్య గురువు కనతాల ఫణీల్ పర్యవేక్షణలో 31 మంది విద్యార్థులు ప్రారంభిక ప్రాక్టికల్-1, భూషణ్ ప్రాక్టికల్ విభాగంలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నాయి. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు డిప్లొమా కోర్సుకు అర్హత ధ్రువీకరణ పత్రాలును అందించారు. అనంతరం డాక్టర్ ప్రతిమాసునీల్ ఘనంగా సన్మానించారు.



పోటీలలో పాల్గొన్న చిన్నారులు

ముగిసిన శ్రీచైతన్య క్రీడోత్సవాలు

ఖమ్మంస్పోర్ట్స్/ ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు30(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సర్దార్‌పటేల్‌స్టేడియంలో గత రెండురోజులుగా జరిగిన తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల జోనల్ క్రీడలు ముగిశాయి పోటీలలో ఖమ్మం మమతారోడ్డులోని శ్రీచైతన్య ఒలంపియాడ్ పాఠశాల ప్రథమ, సీబీఎస్ఈ బ్రాంచి రన్నరప్ సాధించింది. పోటీల అనంతరం విజేతలకు విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ డైరెక్టర్ శ్రీవిద్య బహుమతులు అందించారు ఈకార్యక్రమంలో ఏజీఎం చేతన్ మాధుర్, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, శ్రీదేవి, నీరజ, పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య

కాంగ్రెస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి

తిరుమలాయపాలెం నవంబరు30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి చెందుతాయని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. మండలంలోని రాజారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా గ్రామసర్పంచ్ అభ్యర్థిగా మందుల అరుణను ప్రకటించారు. ఈకార్యక్రమంలో వీరన్న, శ్రీనిఆవాసరెడ్డి, మంగయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నేలకొండపల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని నేలకొండపల్లి ఎస్‌ఐ పెంటరి సంతోష్ హెచ్చరించారు. ఆదివారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న వేళ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై కేసులు పెట్టటంతో పాటుగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా దుష్ప్రచారం చేయటం, కుల, మతాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయటం నిషిద్ధమన్నారు. శాంతి భద్రతలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న పోస్టులను సోషల్ మీడియాలో నుంచి షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.

ప్రజాదరణతో జోనల్ వ్యవస్థ బలోపేతం

» నేడు అందుబాటులోకి ఈస్ట్ జోన్ కార్యాలయం
» ఐదు జోనల్ వ్యవస్థలుగా ఖమ్మం నగరం విభజన పూర్తి
» విధానపరమైన మార్పులు పూర్తి చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఖమ్మం గ్రామ పంచాయతి, మున్సిపాలిటీ, నగర పాలక సంస్థ వరకు ఎందరో కమిషనర్లు వచ్చి వెళ్లారు. కానీ పెరిగిన ఖమ్మం విస్తరణకు తగిన విధంగా పౌర సేవలను స్థానికంగా అందించేందుకు దృష్టి సారించలేదు. వరంగల్ జిల్లాలో 3వేల జనాభాతో ఉన్న ఖమ్మం, ఇప్పుడు 5లక్షలకు పైగా జనాభాతో ఖమ్మం నగర పాలక సంస్థగా అభివృద్ధి జరిగింది. సమీపంలోని గ్రామ పంచాయతీలను తనలో విలీనం చేసుకొని హైదరాబాద్, వరంగల్ తర్వాత ఖమ్మం నగరంగా మారిపోయింది. ప్రస్తుతం 60 డివిజన్లు, 20 రెవెన్యూ బ్లాక్‌లుగా విభజన జరిగి నగర ప్రజలకు పౌర సేవలను అందిస్తోంది. ఒకే కమిషనర్ పనిచేసిన కాలంలో జోనల్ వ్యవస్థకు శ్రీకారం చుట్టి విధానపరమైన నిర్ణయాలు తీసుకొని వాటిని పూర్తిస్థాయిలో పరిపాలన అమలులోకి తీసుకువచ్చిన కమిషనర్‌గా అభిషేక్ ఆగస్త్య తనదైన మార్కును చూపించారు.

పెరిగిన నగర విస్తరణతో పాటుగా జనాభా పెరగడంతో ఖమ్మం నగర పాలక సంస్థ ఒకే కార్యాలయం ద్వారా పౌరసేవలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందటం జాప్యం జరుగుతుంది. ప్రజలు ప్రతి పనికి సుదూర ప్రాంతాల నుంచి కేఎంసీ కార్యాలయానికి వ్యయ, ప్రయాసల కోర్చి రావటం ఇబ్బంది కరంగా మారింది. దీంతో పూణె, గ్రేటర్ హైదరాబాద్ తరహాలో జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు విధానపరమైన నిర్ణయానికి కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య శ్రీకారం చుట్టారు. దాదాపుగా ఏడాది పాటు కార్యచరణ చేశారు. నగరంలోని ప్రతి 10 నుంచి 15డివిజన్లుకు ఒక జోనల్ వ్యవస్థకు రూట్ మ్యాప్ చేశారు. నగరానికి నలు దిక్కులా నాల్గు జోనల్ కార్యాలయాలతో పాటుగా కేఎంసీ కార్యాలయం సెంట్రల్ జోనల్ వ్యవస్థగా కార్యాచరణ చేశారు. ఖమ్మం నగరంలోని డివిజన్లలో పలుమార్లు పర్యటనలు చేశారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు సూచనలు సలహాలు మేరకు వారు కోరిన విదంగా జోనల్ కార్యాలయాల్లో మార్పులు చేశారు. తర్వాత దశల వారీగా జోనల్ వ్యవస్థ కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. తొలి జోనల్ కార్యాలయం పాత మున్సిపల్ కార్యాలయంలో వెస్ట్ జోన్‌ను మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి ప్రారంభించారు. తర్వాత రెండో జోనల్ కార్యాలయం బల్లేపల్లిలో నార్త్ జోన్ కార్యాలయం ప్రారంభించారు. గత నెలలో మూడో జోనల్ కార్యాలయం త్రీటౌన్‌లో జమలాపురం కేశవరావు పార్కులో సౌత్ జోనల్ కార్యాలయం ప్రారంభించారు. సోమవారం నాల్గో జోనల్ కార్యాలయం ఈస్ట్ జోనల్ కార్యాలయం మమత రోడ్డులో ప్రారంభానికి సిద్ధం చేశారు.

అవగాహన లేక సెంట్రల్ కార్యాలయానికి

నాలుగు జోనల్ కార్యాలయాలతో పాటుగా సెంట్రల్ జోనల్ కార్యాలయం ద్వారా నగర ప్రజలకు పౌర, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు పట్టుదలతో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య జోనల్ వ్యవస్థకు రూపకల్పన చేసి పరిపాలన అమలులోకి తీసుకువచ్చారు. ప్రతి సోమవారం ఆయా జోనల్ కార్యాలయాల్లో అధికారులను అందుబాటులో ఉంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. అయితే మొదటి జోనల్ కార్యాలయం ప్రారంభమై ఆరు నెలలైనా ఆయా ప్రాంత ప్రజలు ఇప్పటికే కేఎంసీ కార్యాలయానికి సమస్యలు చెప్పుకునేందుకు వస్తున్నారు. 90శాతం ప్రజలకు స్థానికంగా జోనల్ కార్యాలయం అందుబాటులో ఉన్న విషయం తెలియటం లేదు. జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్న కార్పొరేటర్లు అధికారులు జోనల్ కార్యాలయంపై దృష్టి సారించటం లేదు.

ప్రతి జోనల్ వ్యవస్థలో పారిశుద్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ఉద్యానవనం ఇలా 12 మంది ఉద్యోగులను కేటాయించారు. వారికి స్థానికంగా హాజరు రికార్డులను ఏర్పాటు చేశారు. ఆయా జోనల్ వ్యవస్థకు కేటాయించిన ఉద్యోగులు ఉదయం సమయంలో జోనల్ కార్యాలయానికి వెళ్లి తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్తే కార్పొరేటర్లు నుంచి ప్రజల వరకు స్థానిక కార్యాలయానికి రావటం ద్వారా జోనల్ వ్యవస్థ బలోపేతం జరుగుతుంది. ఇదిలా ఉంటే ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టీఎంసీ, డీఎంసీ, ప్రాజెక్టు డైరెక్టర్ వరకు ఒకే కార్యాలయంలో ఉండి నగరంలో మెప్మా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కమ్యూనిటీ ఆర్గనైజర్లుకు జోనల్ వ్యవస్థకు దాదాపుగా డివిజన్లు కేటాయింపు జరిగింది. కేఎంసీ ఉద్యోగులతో పాటుగా ప్రతి జోనల్ కార్యాలయానికి ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్‌కు సీటు కేటాయిస్తే ఆ కమ్యూనిటీ ఆర్గనైజర్ పరిధిలోని ఆర్పీలు, మహిళా సంఘాలు తరుచూ జోనల్ కార్యాలయాలకు రావటం అలవాటుగా మారుతోంది. దీంతో స్థానికంగా ఉన్న మహిళలు, ప్రజలకు జోనల్ వ్యవస్థలో పౌరసేవలపై అవగాహన పెరిగి జోనల్ వ్యవస్థ బలోపేతం అవుతోంది.

నగరంలో మధ్యలో ఉన్న కేఎంసీ కార్యాలయానికి విలీన ప్రాంత ప్రజలు రావటం ఇబ్బందిగా ఉండటంతో మమత రోడ్డులో పబ్లిక్ హెల్త్ వాటర్ ట్యాంకు భవన సముదాయంలో ఈస్ట్ జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలతో సోమవారం ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. ఈస్ట్ జోనల్ కార్యాలయం ద్వారా 11వ డివిజన్ నుంచి 22 డివిజన్ ప్రజలకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇటీవల కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య జోనల్ కార్యాలయం పనులను పరిశీలించి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

నేడు కేఎంసీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష

ఖమ్మం కార్పొరేషన్: ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పథకాలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక రివ్యూ చేపటనున్నారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి సంబంధించిన అంశాలను ఇంజనీరింగ్, ఇతర విభాగాల అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేరుగా సమీక్ష చేపటనున్నారు. ఖమ్మం నగరంలో అండర్ డ్రైయినేజీ, మున్నేరుకు కరకట్ట పనులు వేగంగా జరిగేందుకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్గదర్శకం చేయనున్నారు. ఈ మేరకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఏర్పాట్లు చేశారు.

108 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



వివరాలను ప్రదర్శిస్తున్న అధికారులు

బోనకల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఏడు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో మొత్తం 108 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 210 వార్డులకు గానూ 500 నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారులు ఆదివారం నామినేషన్ల పరిశీలన అనంతరం చెల్లుబాటైన అభ్యర్థుల వివరాల జాబితాను నోటీసు బోర్డుల పై ప్రదర్శించారు.

పేదలకు ఇందిరమ్మ ఇల్లు..

» కాంగ్రెస్ ఘనతే.. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న లబ్దిదారురాలు ఉషా

సత్తుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం పట్టణంలోని నేతాజీ రోడ్‌లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ యజమానులు నిరుకొండ రాంబాబు, ఉషా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పేదలకు మరింత లబ్ధిచేకూరుతుందని, నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించే ప్రభుత్వాలనే ప్రజలు ఆశీర్వదిస్తారని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పవన్, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, మందపాటి పద్మజ్యోతి రవీందర్‌రెడ్డి, దూదిపాల రాంబాబు, గఫార్‌ఖాన్, నాగళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

'యువభారత్‌శక్తి' ఎందరికో స్ఫూర్తి: ఏసీపీ



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న కల్లూరు ఏసీపీ వసుంధర

సత్తుపల్లిరూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): యువభారత్‌శక్తి సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయని, ప్రతిఒక్కరూ వాటిని ఆదర్శంగా తీసుకోవాలని కల్లూరు ఏసీపీ పీ.వసుంధర యాదవ్ అన్నారు. వెన్నెపూస సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని రామ్‌నగర్‌కు చెందిన నక్కా మనీషాకు చికిత్స నిమిత్తం యువభారత్‌శక్తి ఆధ్వర్యంలో సేకరించిన రూ.45వేల నగదును బాధిత కుటుంబానికి ఏసీపీ చేతులమీదుగా అందజేశారు. ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడటానికి ముందుకు వచ్చి సహాయం చేసిన ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదాయమే కాదు.. ఆరోగ్యమూ ముఖ్యమే



వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి ఆదాయం, సంపదతోపాటు ఆరోగ్యమూ ముఖ్యమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. వైరా లయన్స్ క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్, డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శారదా నర్సింగ్ హోంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించడంలో వైరా లయన్స్ క్లబ్ ముందంజలో ఉందన్నారు. ఈ వైద్యశిబిరానికి రోగులు భారీగా తరలివచ్చారు. వైరా ఏఎంసీ చైర్మన్ బోళ్ల గంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెకటనర్సిరెడ్డి, డాక్టర్లు కాపా మురళీకృష్ణ, దారెల్లి కోటయ్య, భార్గవ్, ఎన్.సతీష్‌కుమార్, తుమ్మా శ్రీనివాసరెడ్డి, పి.భాస్కర్‌రావు, డి.హరిత, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్‌రావు, శ్యాంబాబు, బుచ్చిరామారావు, రాజేశ్వరి, జాలా పుల్లారావు, నూకల ప్రసాద్, వాసు, మిట్టపల్లి సత్యంబాబు, కొల్లా రాంబాబు పాల్గొన్నారు.

దీటైన అభ్యర్థులను పోటీకి పెట్టండి

» బీఆర్ఎస్ నాయకులతో సండ్ర



బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన సండ్ర

సత్తుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు దీటైన అభ్యర్థిని బీఆర్ఎస్ నాయకులు పోటీకి నిలబెట్టాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. ఆదివారం సండ్ర తన క్యాంపు కార్యాలయంలో సత్తుపల్లి మండల నాయకులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహం మార్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కూసంపూడి రామారావు, తాళ్లూరి రాంబాబు, మోరంపూడి ప్రభాకర్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మోరంపూడి ప్రసాదు, ఎం.వెంకటరెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

తల్లాడలో సందడిగా వనసమారాధన



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

తల్లాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తల్లాడలో వనసమరాధన కార్యక్రమం సందడిగా జరిగింది. స్థానిక వెంకటగిరి క్రాస్‌రోడ్‌లోని మామిడితోటలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం 2026 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు రుద్రాక్ష నరసింహాచారి, తాటికొండ కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రుద్రాక్ష బ్రహ్మం, కోశాధికారి గంటల వెంకటాచారి, ఉపాధ్యక్షుడు ఇందోజు రవి, తాటికొండ మనుబ్రహ్మాచారి,పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్ర్కూటినీ పూర్తి



నామినేషన్ కేంద్రం వద్ద స్ర్కూటినీ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చింతకాని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చింతకాని మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్ర్కూటినీ ఆదివారం పూర్తి అయింది. 26 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌కు 161, వార్డులకు 626 నామినేషన్లు దాఖలవ్వగా వాటి పరిశీలనను ఎన్నికల అధికారులు పూర్తిచేశారు. నాగులవంచలో నామినేషన్ స్ర్కూటినీ ప్రక్రియను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ పరిశీలించారు.

దిత్వా హెచ్చరికలు.. రైతులు అప్రమత్తంగా ఉండాలి



చింతకానిలో ధాన్యం పోగు చేస్తున్న రైతులు

చింతకాని, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను ప్రభావం జిల్లా పై ఉంటుందని వాతావరణ అధికారులు ప్రకటించడంతో రైతులు అప్రమత్తమయ్యారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వరి కోతలు జోరందకున్నాయి. ఖల్లాల్లో ధాన్యం రాశులు ఆరబోయడంతో తుఫాను వర్షాలకు పంట తడవకుండా రైతులు జాగ్రత్త పడుతున్నారు. తుఫాను ప్రభావం రెండు రోజుల వరకు ఉంటుందని అధికారులు తెలపడంతో రైతులు ఆదిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కారేపల్లి: దిత్వా తుఫాన్ వల్ల వర్షంపడే అవకాశం ఉందని, దీంతో మండల రైతులు ప్రధానంగా వరి రైతులు కల్లలోనే వరి ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలను కప్పుకుని జాగ్రత్తలు పడాలని మండల ఎవో బట్టు అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి కల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభవం మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. కప్పిఉంచిన ధాన్యాన్ని వర్షాం తగ్గాక వెంటనే ఎండలో ఆరపెట్టుకోవాలన్నారు. వరి కోతలు కూడా తుఫాన్ అనంతరం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

ముగిసిన తొలి దఫా పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం

అర్ధరాత్రి తర్వాత కూడా పూర్తికాని నామినేషన్లు

కొణిజర్ల,నవంబరు30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్‌లు కొణిజర్ల మండలంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడ కొనసాగాయి. 27 గ్రామ పంచాయతీలకు 9 నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదదటి రోజు కంటే చివరి రోజు నామినేషన్‌లు భారీగా పడటంతో అర్ధరాత్రి వరకు సమయం పట్టింది. దీనికి సంబంధించిన వివరాలును అధికారులు ఆదివారం తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లకు 194 నామినేషన్‌లు వేశారు. 27 పంచాయతీల పరిధిలోని 254 వార్డులకు 634 నామినేషన్‌లు పడ్డాయి. ఎన్నికల సిబ్బంది, మండలాధికారులు రాత్రంతా కూడ నామినేషన్‌ల పనిలోనే ఉన్నారు.

అర్బన్ పార్క్‌లో దుప్పి మృతి

● నోరు విప్పని అధికారులు



సత్తుపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని అర్బన్ పార్క్‌లో ఆదివారం దుప్పి చనిపోయింది. పార్కులో చనిపోయి ఉన్న దుప్పి వాకర్స్‌కు కనిపించింది. దీంతో దుప్పి ఫొటోలు, వీడియో తీసి వాకర్స్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రెండు రోజుల క్రితం దుప్పి చనిపోయి ఉంటుందని వాకర్స్ అనుమానం వ్యక్తం చేసారు. చనిపోయిన దుప్పిని అటవీ సిబ్బంది ఖననం చేశారు. దుప్పి మృతికి కారణాలను వెల్లడించేందుకు కూడా అధికారులు పెదవి విప్పని పరిస్థితి ఉంది. విచిత్రమేమిటంటే.. ఇదే పార్కులో శనివారం విచారణ పేరుతో అధికారులు సిబ్బంది పార్కులో ఉన్నారు. కానీ అటవీ శాఖాధికారులకు చనిపోయిన దుప్పి కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అటవీ సిబ్బందికి కనిపించని చనిపోయిన దుప్పి వాకర్స్‌కు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అర్బన్ పార్క్‌లో దుప్పులకు రక్షణ లేకుండా పోయిన సంఘటనపై ఒక పక్క విమర్శలు వెల్లువెత్తుతుండగా.. మరోపక్క అర్బన్ పార్కులో కొందరు దుప్పులను వేటాడుతున్నారనే ప్రచారంపై మాత్రం స్థానిక అధికారులు నోరు మెదకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఏన్కూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామానికి చెందిన బత్తుల దుర్గాప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ రవాణ అధికారి బొర్రా తిరుపయ్య ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థికసాయం అందించారు. గ్రామస్తులు తెప్పల సత్యం, మేడ వెంకటేశ్వర్లు, ఇస్సన్నపల్లి నాగేశ్వరరావు, వేముల సీతారాములు, బండ యల్లయ్య, బత్తుల యల్లయ్య, ఎస్‌కే ముస్తఫా, రాయల ప్రశాంత్,దేవల యల్లయ్య, కంచపు వెంకన్న ,మేలు నాగరాజు, బొర్ర నరేష్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాలి

» యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

» ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



జిల్లా స్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

కల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ అన్నారు. కల్లూరులో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె రంజాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ ప్రసంగిస్తూ.. విద్యా రంగ బలోపేతానికి పర్యవేక్షణ అధికారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల అవసరలను గుర్తించి పనిచేసినప్పుడే సమాజంలో ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఎఫ్ఆర్ఎస్ నివేదికలతో విద్యారంగం బలపడదని అవసరమైన పర్యవేక్షణ రంగాన్ని పటిష్టం చేయాలని చెప్పారు. వర్క్ అడ్జస్ట్మెంట్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సంఖ్య 50 దాటినచోట ఐదుగురు రెగ్యూలర్ ఉపాధ్యాయులను నియమించాలని, శాస్త్రీయంగా ఈ నిష్పత్తిని పాటిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చునని ఆయన పేర్కొన్నారు. పలు రకాల నివేదికలు ఎఫ్ఆర్ఎస్‌ల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయటం తగదన్నారు. అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయకుండా గురుకులాలు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల చేయడంతో జిల్లా పరిషత్ పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ సమావేశంలో పీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వినర్ జీవీ నాగమల్లేశ్వరరావు ప్రసంగించారు. అంతకు ముందు కల్లూరు నూతన బస్టాండు నుంచి నేరుగా ఏఎంసీ కార్యాలయ ప్రాంగణం వరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ఉపాధ్యాయులు మహాప్రదర్శన అనంతరం యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు చావా దుర్గా భవానీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగమల్లేశ్వరరావు, ఎస్‌కె షమీ, కల్లూరు మండల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయాల నాగేశ్వరరావు, కె విజయకుమార్‌లతో పాటుగా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే రాగమయి..

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో జిల్లా స్థాయి టీఎస్‌యూటీఎఫ్ విస్తృత సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక మరుగున పడగా తమ ప్రభుత్వ దశల వారిగా పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అవసరమైతే ఉపాధ్యాయుల సమస్యల విషయంలో తాను సీఎం రేవంత్‌రెడ్డితో సంప్రదిస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పెంచుతూ, క్రమ శిక్షణతో కూడిన విద్య బోధన అందిచాలని ఉపాధ్యాయులను కోరారు. అంకిత భావంతో నాణ్యమైన విద్యను అందించి సర్కారు స్కూల్స్‌ను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే విజ్ఞాపించారు.

సెల్‌టవర్ నిర్మించొద్దు



కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న యువత

వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో సెల్‌టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం గ్రామస్తులు నిరసన తెలిపారు. సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలో సెల్‌టవర్ నిర్మాణం వల్ల అనేక రుగ్మతలు, సమస్యలు తలెత్తే ప్రమాదమున్నందున వెంటనే ఈ సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆఫిర్యాదులో కోరారు.

వైరా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సురేష్‌బాబు



వైరా, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైరా డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్. సురేష్‌బాబు ఇన్‌చార్జ్ తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు సెలవుపై వెళ్లడంతో పూర్తిస్థాయి అధికారాలతో డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబుకు బాధ్యతలను అప్పగించారు.

ఆ గ్రామాల్లో అధికార పార్టీకి రెబల్స్ దడ

» అసంతృప్తులను బుజ్జగించే పనిలో నేతల పరుగులు

» సాఫీగా సాగుతున్న కూటమి జర్నీ

బోనకల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ అభ్యర్థుల పోటీలో అధికార పార్టీకి రెబల్స్ దడ తప్పడం లేదు. కొన్ని గ్రామాల్లో నామినేషన్లు ఎక్కువగా వేయడంతో అసంతృప్తులను బుజ్జగించే పనిలో నేతలు నిమగ్నమయ్యారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీలుగా పేరున్న బోనకల్‌లో నలుగురు, రావినూతలలో ముగ్గురు, మోటమర్రి, రాపల్లి. చిన్నబీరవల్లి గ్రామాల్లో ఇద్దరు చొప్పున సర్పంచ్ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. బోనకల్ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థిగా చావా ఉషారాణి నామినేషన్ దాఖలు చేసినప్పటికి, భూక్యా మంగమ్మకు మద్దతు పలికారు. దీంతో అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా భూక్యా మంగమ్మ నామినేషన్ వేశారు. ఆమె నామినేషన్ ర్యాలీలో డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని పాల్గొన్నారు. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మోర్ల రమ్యకృష్ణ, రాయల ప్రభావతిలు కూడ నామినేషన్లు వేయడంతో ఒకే పార్టీ నుంచి ముగ్గురు పోటీలో ఉన్నారు. రావినూతల గ్రామ పంచాయతీలో గుగులోతు రుప్లా నాయక్, బద్రు నాయక్, బాణోతు రాములు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. రాపల్లి గ్రామంలో మోదుగు భూలక్ష్మీ, తాళ్లూరి వెంకట రాములు, మోటమర్రిలో మర్రి సురేష్, మోదుగు సుదీర్, గోపినాద్, చిన్నబీరవల్లిలో చంద్ర సరిత, చంద్ర శ్రీలక్ష్మీ, గుండ్ర రజినీలు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పోటీ దారులను బరిలో ఉంచి మిగిలిన వారిని పక్కకు తప్పించేందుకు గానూ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెబల్స్ బరిలో ఉన్నట్లైతే ఫలితాలపై ప్రభావం పడనుందన్న చర్చ జరుగుతోంది. ఇది ఇలా ఉండగా మండలంలో బీఆర్ఎస్, సీపీఎంలతో పాటు సీపీఐ, టీడీపీ, బీజేపీ కూటమి జర్నీ ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగుతోంది.

మధిర రూరల్: మధిర మండలంలో సర్పంచ్ అభ్యర్థులకు మెజార్టీ పంచాయతీల్లో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 27గ్రామపంచాయతీలకుగానూ సర్పంచ్ అభ్యర్థులకు 146నామినేషన్లు, వార్డులకు 525నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక్క సిద్ధినేనిగూడెం గ్రామంలోనే ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి వేల్పుల వెంకట్రావమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లయింది. నామినేషన్ల స్ర్కూటినీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేసిన నామినేషన్లు అన్నీ సక్రమంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద..

మధిర మండలంలో మెజార్టీ గ్రామపంచాయతీల్లో అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్‌కు రెబల్స్ ఎక్కువగా ఉంది. దీంతో ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది. సిరిపురం, దెందుకూరు, రాయపట్నం, నాగవరప్పాడు గ్రామాల్లో కాంగ్రెస్ రెబల్స్ పోటీలో ఉండగా బీఆర్ఎస్‌కు నాగవరప్పాడు, మాటూరుల్లో రెబల్స్ బెడద ఉంది. ఎలాగైనా రెబల్స్‌ను తప్పించాలనే ప్రయత్నాల్లో ఆయా పార్టీల అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

నామినేషన్ల స్వీకరణలో బాధ్యతగా ఉండాలి



వెంకటాపురంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

ముదిగొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల స్వీకరణ విషయంలో బాధ్యతగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. ఆదివారం ముదిగొండ మండలం వెంకటాపురంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా స్వీకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులేదన్నారు. అభ్యర్థుల సందేహాలకు పూర్తిస్థాయిలో సమాధానాలు ఇచ్చి నామినేషన్లను స్వీకరించాలని సూచించారు. నామినేషన్ల కేంద్రంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలంలో 25గ్రామపంచాయతీలు, 246వార్డులకుగానూ రెండోవిడత గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నామినేషన్ స్వీకరణకు 9 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ తొమ్మిది నామినేషన్ల కేంద్రాల్లో 9మంది సర్పంచ్ అభ్యర్థులు, 9మంది వార్డు మెంబర్లకు సంబంధించి నామినేషన్లను అధికారులు స్వీకరించారు. వల్లభిలో 1, వెంకటాపురంలో 3, ముదిగొండలో 1, మల్లన్నపాలెం, ఖానాపురం, ఖానాపురం సర్పంచ్ పదవులకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించినట్లు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, ఎంపీడీవో శ్రీధర్‌స్వామి తెలిపారు.

మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కారేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం అమ్మ హాస్పటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి మండల పరిధిలోని పరిసరా ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చి వైద్య సేవలు వినియోగించుకున్నారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు అజ్మీర భగత్‌సింగ్, ఎముకలు, కండరాల నిపుణులు అజ్మీర సుభాస్ చంద్రబోస్, స్త్రీ వైద్యులు దీపిక పాల్గొని ప్రజలకు వైద్య సేవలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందచేశారు.

ఏకగ్రీవానికి ఎర..

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఖాతాలో జమ కానున్నాయి. మొదట విడతగా 7 మండలాల్లో 192 గ్రామ పంచాయతీలకు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే నామినేషన్ల ఉపసంహరణలోగా మిగిలిన పంచాయతీల్లోనూ ఏకగ్రీవంగా చేసేందుకు ఆయా మండలాల్లో జోరుగా మంతనాలు సాగుతున్నాయి. అధికారపార్టీకి సర్పంచ్ పదవి విపక్షపార్టీలకు ఉప సర్పంచ్ పదవులు, మెజారిటీ వార్డులు ఇచ్చేలా కొన్నిచోట్ల ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇక రెండోవిడతగా కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని 183 పంచాయతీలకు నామినేషన్ల పర్వం మొదలైంది. ఇక్కడ కూడా ఏకగ్రీవానికి మంతనాలు నడుస్తున్నాయి. ఏకగ్రీవానికి సహకరించే వారికి అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కలిపించేలా ఒప్పందాలు సాగుతున్నాయి. పంచాయతీ నిధుల, పనులు సర్పంచ్ పదవి ఆశించి ఉప సంహరించుకునే వారికి కొన్నిచోట్ల ఇవ్వాలని 'ముందస్తు' ఒప్పందాలు చేసుకుంటున్నారు. మొత్తమ్మీద ఎక్కువశాతం ఏకగ్రీవం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎన్నికల్లో పోటీకి దిగితే రూ. లక్షలు ఖర్చుపెట్టే పరిస్థితి ఉన్నందు వల్ల తక్కువఖర్చుతో ఏకగ్రీవాలు చేసుకోవాలన్న అభిప్రాయం ఆశావహుల్లో వ్యక్తమవుతోంది.

నేషనల్ ఇన్స్‌పిరేషన్ అవార్డుకు కల్లూరు హెడ్‌మాస్టర్



బండారు దత్తాత్రేయ చేతుల మీదగా అవార్డు అందుకుంటున్నహెచ్ఎం

కల్లూరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న ఎండీ.మౌలాలికి నేషనల్ ఇన్స్‌పిరేషన్ అవార్డు దక్కింది. ఆదివారం హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారద ఎడ్యూకేషన్ సొసైటీ తరుపున ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ దాసోజు శ్రీనివాస్ ఈ అవార్డును హెచ్ఎం మౌలాలీకి అందజేశారు. మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న మౌలాలి పేద, ప్రతిభవంతులైన విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక నూతన కార్యక్రమాలు చేపట్టి గణిత శాస్త్రాన్ని సులభతరం చేస్తూ, విద్యార్థుల భవిష్యత్ వికాసానికి పాటుపడుతూ చేస్తున్న సేవలను గుర్తిస్తూఈఅవార్డుకు ఎంపికయ్యారు. ఉచిత విద్య సామాగ్రి పంపిణీ, గణితంలో భయాన్ని తొలిగించే ప్రయోగాత్మక విధానాలు, గ్రామీణ విద్యార్థులకు పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో ఆయన మార్గదర్శకంగా నిలిచారు. ఈ అరుదైన గౌరవం తెలంగాణ విద్యారంగానికి, ఖమ్మం జిల్లాకు, పాఠశాల విద్యకు ఒక ప్రతిష్టాత్మక ఘనతగా నిలిచింది. విద్యాసేవే మహాసేవ అనే ధ్యేయంతో పనిచేస్తున్న హెచ్ఎం మౌలాలికి గవర్నర్ దత్తాత్రేయ, ఎమ్మెల్సీ శ్రీనివాస్, శారద ఎడ్యూకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్‌తో పాటుగా పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు శాలువతో సత్కరించి అభినందించారు.

తల్లాడ పంచాయతీ టీడీపీ అభ్యర్థిగా కొమ్మినేని

తల్లాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తల్లాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి టీడీపీ అభ్యర్థిగా కొమ్మినేని రామయ్యను ప్రకటించారు. ఆదివారం తల్లాడలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నాయకుడు కేతినేని హరీష్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించి టీడీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. తల్లాడ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు 14వార్డుల్లో పోటీచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దూపాటి భద్రరాజు, మొక్క కృష్ణార్జున్, కొమ్మినేని సత్యనారాయణ, నారపోగు ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన ఖాజీపురం మాజీ సర్పంచ్ నజీర్

మధిర రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఖాజీపురం, మహదేవపురం గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన కుటుంబాల వారు ఆదివారం అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖాజీపురం మాజీ సర్పంచ్ షేక్.నజీర్, మహదేవపురం గ్రామ సొసైటీ మాజీ డైరెక్టర్ గోవిందరాజులు పలు కుటుంబాలతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నాయకులు సూరంశెట్టి కిషోర్, కరీముల్లా, కమాల్ పాల్గొన్నారు.